

వర్షంతో దెబ్బతిన్న బొప్పాయి

● రూ.కోట్ల నష్టం

● లబోదిబోమంటున్న రైతులు

7



ఎండీయూల వ్యవస్థను రద్దు చేయాలి

6

● రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దివి లీలామాధవరావు



సిద్దవటం మండలంలో లింగంపల్లె ప్రధాన రహదారిలో వర్షపునీరు



దెబ్బతిన్న మదనగోపాలపురం రోడ్డు

రాజంపేట నియోజకవర్గానికి రాజకీయ గ్రహణం పట్టుకుంది. నూతన ప్రభుత్వం ఏర్పడి రాష్ట్ర వ్యాప్తంగా గ్రామాలలో పల్లె పండుగ పేరుతో.. అభివృద్ధి పనులకు భూమి పూజలు, పనుల ప్రారంభంతో హడావుడిగా ఉంటే.. రాజంపేట నియోజకవర్గంలో ఆ ఊసే లేదు. ఇక్కడ అభివృద్ధి పనుల పండుగ లేదు. తాము ముందుండి ఈ అభివృద్ధి కార్యక్రమాలను చూసుకోవాల్సిన అధికార తెలుగుదేశం పార్టీ నాయకులు నియోజకవర్గ ఇన్‌చార్జ్ పదవి కోసం రచ్చపడుతున్నారు. తాను ఇన్‌చార్జ్ అంటే.. కాదు కాదు.. తానే ఇన్‌చార్జ్ అంటూ.. గ్రూపులు తగాదాలకు దిగుతున్నారు. రాష్ట్రమంతటా తెలుగుదేశం పార్టీ అవలంబిస్తున్న విధానానికి భిన్నంగా రాజంపేట నియోజకవర్గంలో కొందరు సమన్వయ కర్తలు జోక్యం చేసుకుని.. సమస్యను మరింత జఠిలం చేసి పార్టీ పరువు బజారున పడేస్తున్నారని తెలుగు తమ్ముళ్లు ఆవేదన చెందుతున్నారు. అభివృద్ధి పనులు చేయాల్సిన అధికారులు.. ఇన్‌చార్జ్ గొడవలో తాము తలదూర్చడం ఎందుకుని మౌనంగా చూస్తున్నారు.

రాజంపేటకు పల్లె పండుగ లేనట్లే..?

● ఇన్‌చార్జ్ రచ్చలో టీడీపీ నాయకులు

● వేడుక చూస్తున్న అధికారులు

● అభివృద్ధి పనులకు గ్రహణం



(రాయచోటి-ఆంధ్రజ్యోతి): గత ఎన్నికల్లో జిల్లాలోని రాయచోటి, మదనపల్లె, పీలేరు నియోజకవర్గాలలో తెలుగుదేశం, రైల్వేకోడూరులో జనసేన గెలిచింది. రాజంపేట, తంబళ్లపల్లె నియోజకవర్గంలో పోటీ చేసిన టీడీపీ ఓటమి పాలైంది. అయితే రాష్ట్ర వ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ తరపున పోటీ చేసి ఓడిపోయిన అభ్యర్థులే నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లుగా కొనసాగుతున్నారు. జిల్లాలోని తంబళ్లపల్లె నియోజకవర్గంలో కూడా టీడీపీ తరపున పోటీ చేసి ఓడిపోయిన జయచంద్రారెడ్డి ఇన్‌చార్జ్‌గా కొనసాగుతున్నారు. ఆయన ఆధ్వర్యంలోనే పార్టీ కార్యక్రమాలు, అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి. అయితే రాజంపేట నియోజకవర్గంలో అందుకు భిన్నంగా జరుగుతున్నాయి. ఇక్కడ టీడీపీ తరపున సుగవాసి బాలసుబ్రమణ్యం పోటీ చేసి ఓడిపోయారు. ముందునుంచీ ఉన్న తెలుగుదేశం పార్టీ సంప్రదాయం ప్రకారం ఈయనే నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా కొనసాగాలి. ఈయన ఆధ్వర్యంలోనే పార్టీ కార్యక్రమాలైనా.. అభివృద్ధి కార్యక్రమాలైనా జరగాలి. అయితే ఇక్కడ పలువురు తాము టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లమంటూ ముందుకు వచ్చారు. గతంలో ఇక్కడ పోటీ చేసిన ఓ నాయకుడూ, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు కూడా నియోజకవర్గ ఇన్‌చార్జ్ పదవి ఆశించారు.

సమన్వయకర్తతో మరింత సమస్య

పోటీ చేసి ఓడిపోయిన బాలసుబ్రమణ్యం, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజుల మధ్య విభేదాలు రాజంపేట పట్టణంలో అన్నాక్యాంటీన్ ప్రారంభం సందర్భంగా బయటపడ్డాయి. జిల్లా అధ్యక్షుడు జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో పార్టీ బలోపేతం చేయడానికి కృషి చేయాలి కానీ రాజంపేటలో ఇన్‌చార్జ్ పదవి కోసం గ్రూపులు కడుతున్నారని బాలసుబ్రమణ్యం వర్గీయులు ఆరోపణలు చేస్తున్నారు. అయితే జిల్లా అధ్యక్షుడి హోదాలో ఎక్కడైనా కార్యక్రమాలలో పాల్గొనే స్వేచ్ఛ తమ నాయకుడికి ఉంటుందని జిల్లా అధ్యక్షుడి వర్గీయులు పేర్కొంటున్నారు. ఈ సంఘటన నేపథ్యంలో రాజంపేట నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలన సందర్భంగా ప్రకటించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డిని సమన్వయకర్తగా పార్టీ నియమించింది. అయితే సమన్వయకర్త వల్ల సమస్య పరిష్కారం కాకపోగా మరింత జఠిలమైందని నియోజకవర్గంలోని తెలుగుతమ్ముళ్లు ఆవేదన చెందుతున్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా బాలసుబ్రమణ్యం సభలు నిర్వహించారు. అయితే ఈ సభలకు అధికారులు ఎవరూ రాకుండా కలెక్టర్ ద్వారా సమన్వయకర్త, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి అడ్డుకున్నారనే ప్రచారం నియోజకవర్గ వ్యాప్తంగా ఉంది. ఈ సంఘటనతో నియోజకవర్గంలో బాలసుబ్రమణ్యం, జగన్‌మోహన్‌రాజు వర్గాల మధ్య దూరం మరింతగా పెరిగింది. వాస్తవానికి సమన్వయకర్త సమర్థవంతంగా పనిచేసి ఉంటే రెండు వర్గాల మధ్య గొడవలు సమసిపోయేవి. అయితే సమన్వయకర్త ఒక వర్గానికి మేలు చేసే విధంగా వ్యవహరించడంతో సమస్య పెద్దదై పార్టీ పరువు బజారున పడిందని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు.

అభివృద్ధి పనులకు గ్రహణం

కూటమి ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు ఉపాధి హామీ నిధులను కేటాయించింది. ఈ నిధులతో ప్రతి గ్రామంలోనూ రోడ్ల అభివృద్ధి పనులు చేపట్టాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలోనూ వారం పది రోజులుగా పల్లెపండుగ కార్యక్రమం పేరుతో సిమెంటు రోడ్డు పనులకు భూమి పూజలు జరిగాయి. అయితే రాజంపేట నియోజకవర్గంలో మాత్రం ఈ పనులు జరగలేదు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా బాలసుబ్రమణ్యం ఉన్నప్పటికీ అతనికి అధికారులు ఎవరూ సహకరించడం లేదు. ఈ కార్యక్రమాల గురించి కూడా ఎవరూ ఆయనతో సంప్రదించలేదు. దీంతో ఇప్పటికీ ఈ పనులు ప్రారంభానికి నోచుకోలేదు. అయితే జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు రాజంపేట నియోజకవర్గంలో ఒకచోట పల్లెపండుగ కార్యక్రమంలో సిమెంటు రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. తర్వాత మిగిలిన గ్రామాలలో ఎక్కడా ఈ పనులు ప్రారంభానికి నోచుకోలేదు. దీనిపై నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. ప్రభుత్వం ఇచ్చిన నిధులతో అభివృద్ధి పనులు చేయకుండా ఇలా గ్రూపు తగాదాల్లో మునగడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. వైసీపీ పాలనలో గ్రామాలలో రోడ్లు మరీ అధ్వానంగా ఉన్నాయి. కనీసం నడవడానికి కూడా వీలు కాకుండా ఉంది. రోడ్లపైనే మోకాటి లోతు గుంతలు ఉండడంతో ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లడం లేదు. రాజంపేట మండలంలోని మదనగోపాలపురానికి వెళ్లే రోడ్డు పూర్తిగా దెబ్బతింది. ఈ దారిలో మదనగోపాలపురం, ఎస్సీ కాలనీ, రాజీవ్ స్వగృహ కాలనీ, ఇందిరానగర్ గ్రామాలు ఉన్నాయి. సుమారు 10 వేల మంది జనాభా ఈ రోడ్డుగుండా వెళతారు. ఇటీవల కురిసిన వర్షాలకు, గత ఐదేళ్లగా రోడ్డు మరమ్మతులు చేయని కారణంగా.. రోడ్డు పాడై..ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇదే పరిస్థితి సుండుపల్లె, వీరబల్లి, నందలూరు,.. ఇలా నియోజకవర్గంలోని.. అన్ని మండలాల్లోనూ.. ఇలాగే ఉంది. ఇకనైనా తెలుగుదేశం పార్టీ అధిష్ఠానం జోక్యం చేసుకుని అభివృద్ధి కార్యక్రమాలు మొదలయ్యేలా చూడాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.



సుండుపల్లెలో దారుణంగా ఉన్న గ్రామీణ రోడ్డు

బార్ కిటికిలో నుంచి మద్యం కొనుగోలు చేస్తున్న మద్యం ప్రియులు



మదనపల్లెలో ఎనీ టైమ్ మద్యం..

● ఉదయం 7.30 గంటలకే విక్రయాలు

● బార్ వద్ద మద్యం విక్రయాల ఫొటోలు వైరల్



బార్ డోరు తెరవక ముందే బయట కూర్చుని మద్యం తాగుతున్న దృశ్యం

మదనపల్లె టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కొత్త ఎక్సైజ్ పాలసీ ప్రకారం ప్రైవేటు మద్యం దుకాణాల్లో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు, బార్లలో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు మద్యం విక్రయాలు జరపాలి. కానీ మదనపల్లెలో కొన్ని మద్యం దుకాణాలు, కొన్ని బార్ల వద్ద ఎనీ టైమ్ మద్యం అంటూ విక్రయాలు సాగిస్తున్నారు. గురువారం ఉదయం 7.30 గంటలకే ఓ బార్ వద్ద మద్యం విక్రయాలు చేస్తుండటాన్ని కొందరు జీపీఎస్ ఫొటోలు తీసి సోషల్ మీడియాలో వైరల్ చేశారు. స్థానిక ఆర్టీసీ బస్టాండు సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉన్న ఓ బార్ వద్ద ఉదయం నుంచి మద్యం విక్రయాలు జరిపారు. బార్ కిటికీ తెరచి అక్కడ మద్యం విక్రయిస్తుండగా, మద్యం ప్రియులు అక్కడే అరుగుపై కూర్చుని మద్యం తాగే ఫొటోలు వైరల్ అయ్యాయి. గతంలో కూడా ఈ బార్‌కు బయట మద్యం దుకాణాల నుంచి బీరు బాటిళ్లు తీసుకొచ్చి విక్రయిస్తుండటం కూడా బయటపడిన విషయం తెలిసిందే. ఈ విషయమై మదనపల్లె ఎక్సైజ్ సీఐ భీమలింగను వివరణ కోరగా ఈ బార్‌పై తమకు కూడా ఫిర్యాదులు వచ్చాయని, ఆకస్మిక తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకుంటామని సీఐ వెల్లడించారు.

నమ్మిన పాపానికి.. తల్లిని చేశాడు..

● కురబలకోటలో గర్భం దాల్చిన ఇంటర్ విద్యార్థిని

● యువకుడిపై పోక్సో కేసు నమోదు

కురబలకోట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వారం రోజుల క్రితం గుర్రంకొండ మండలంలో వృత్తి విద్యా కోర్సు చదువుతున్న విద్యార్థిని ఒక యువకుడి మాయమాటలు నమ్మి గర్భం దాల్చి బిడ్డకు జన్మనిచ్చిన సంఘటన మరువముందే గురువారం కురబలకోట మండలంలో అలాంటి సంఘటన వెలుగు చూసింది. తెలిసీ తెలియని వయస్సులో యువకుడు చెప్పిన తియ్యని మాటలను నమ్మి ఓ యువకుడి చేతిలో మోసపోయిన విద్యార్థిని గర్భం దాల్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కురబలకోటకు చెందిన విద్యార్థిని (16) మదనపల్లెలోని ఓ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. లక్కిరెడ్డిపల్లె మండలం కోనంపేటకు చెందిన సయ్యద్‌బాషా కుమారుడు ఖాదర్‌బాషా (24) విద్యార్థిని ఉండే వీధిలో తమ బంధువుల ఇంటికి వస్తుండేవాడు. ఈ నేపథ్యంలో వారిద్దరి మధ్య పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. పెళ్లి చేసుకుంటానని విద్యార్థినికి మాయమాటలు చెప్పి విద్యార్థినితో శారీరకంగా కలిశాడు. దీంతో బాలిక శరీరంలో మార్పులు రావడంతో గమనించిన తల్లి నిలదీయడంతో విషయం బయటపడింది. దీంతో విద్యార్థిని తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు.

మదనపల్లెలో రెవెన్యూ అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ శ్రీధర్, పక్కన జేసీ ఆదర్శ్ రాజేంద్రన్, సబ్ కలెక్టర్ మేఘస్వరూప్



సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

● బదిలీ అయిన వీఆర్‌వోలను వెంటనే రిలీవ్ చేయాలి

● కలెక్టర్ శ్రీధర్

మదనపల్లె టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రసల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్)లో ప్రజల నుంచి వచ్చే సమస్యలను రెవిన్యూ అధికారులు పరిష్కారంలో విఫలమైతే వారికి మైనస్ మార్కులు వేస్తామని కలెక్టర్ శ్రీధర్ చామకూరి సుతిమెత్తగా హెచ్చరించారు. గురువారం స్థానిక టీటీడీ కల్యాణమండపంలో డివిజన్‌లోని రెవిన్యూ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సోమవారం నిర్వహించే పీజీఆర్ఎస్ కార్యక్రమంలో నాలుగున్నర నెలల్లో ప్రజల నుంచి రెవిన్యూ సమస్యలపై 1624 అర్జీలు వచ్చాయన్నారు. అందులో 1120 సమస్యలు పరిష్కరించారని, 464 అర్జీలు ప్రోగ్రెస్‌లో ఉన్నాయని తెలిపారు. ఇవి కాకుండా సమస్యలు పరిష్కారం కాని 40 అర్జీలను ప్రజలు రీఓపెన్ చేశారన్నారు. ప్రజల నుంచి వచ్చే అర్జీలను నామమాత్రంగా విచారించి పరిష్కరించినట్లు నివేదికలు పంపడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. పీజీఆర్ఎస్‌లో వచ్చే అర్జీలను మూడు రోజుల్లో పరిష్కరించాలని, నోటీసులు ఇవ్వాల్సి వస్తే 15 రోజులు, జేసీ, కలెక్టర్ స్థాయిలో ఉంటే నెల రోజుల్లో పరిష్కరించాలని స్పష్టం చేశారు. అలా కాకుండా నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మదనపల్లె డివిజన్‌లోని 153 గ్రామాల్లో 19,764 సర్వే నెంబర్లలో ఫ్రీహోల్డ్ రీసర్వే పూర్తి అయ్యిందన్నారు. రిజెక్ట్ చేసిన భూమి వివరాలను, కారణాలను తప్పనిసరిగా దరఖాస్తుదారుడికి పంపాలన్నారు. హైకోర్టు కేసులు ఉన్న భూవివాదాల్లో కౌంటర్ కేసులు వేయాలని, లోకాయుక్త, జాతీయ మానవ హక్కుల కమిషన్ కేసులు ఎప్పటికప్పుడు విచారించి కౌంటర్లు వేయాలన్నారు. మదనపల్లె మున్సిపాలిటీలో మురుగునీరు శుద్ధి కార్యక్రమంలో భాగంగా భూసేకరణలో అడ్డంకులు తొలగించుకోవాలన్నారు. డివిజన్‌లో బదిలీ అయిన వీఆర్‌వోలను వెంటనే రిలీవ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. డాటెడ్ ల్యాండ్, ఈనాం భూములపై దృష్టి పెట్టాలని, ప్రభుత్వ భూములు కబ్జా అయితే వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. జేసీ ఆదర్శ్ రాజేంద్రన్, సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ రెవిన్యూ అంశాలపై అధికారులకు సూచనలిచ్చారు. సమావేశంలో జిల్లా సర్వే ఏడీ భరత్‌కుమార్, తహసీల్దార్లు, సర్వేయర్లు, డీటీలు, సీనియర్ అసిస్టెంట్లు, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

పాఠశాల విద్యా శాఖాధికారిగా సుబ్రమణ్యం



రాయచోటిటౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా పాఠశాల విద్యా శాఖాధికారిగా (డీఎస్ ఈవో) సీనియర్ డైట్ లెక్చరర్ సుబ్రమణ్యంను నియమిస్తూ ప్రభుత్వ విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 21 జిల్లాలకు జిల్లా విద్యా శాఖ అధికారులను నియమిస్తూ ప్రభు త్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఇందులో భాగంగానే చిత్తూరు జిల్లా కార్వేటీనగర్‌లోని జిల్లా విద్యా శిక్షణ సంస్థలో సీనియర్ అధ్యాపకుడిగా పనిచేస్తున్న సుబ్రమణ్యంను అ న్నమయ్య జిల్లా పాఠశాల విద్యా శాఖాధికారిగా నియమించింది. ఇక్కడ ఇన్‌చార్జి డీఈవోగా పనిచేస్తున్న శివప్రకాశ్‌రెడ్డి రాయచోటి డీవైఈవోగా రెగ్యులర్ పోస్టుకు వెళ్లారు.

రాయచోటి ఆర్డీవోగా శ్రీనివాస్



రాయచోటి రెవెన్యూ డివిజనల్ అధికారిగా (ఆర్డీవో) డిప్యూటీ కలెక్టర్ కె.శ్రీనివాస్ నియమితులయ్యారు. ఇక్కడ రెవెన్యూ డివిజన్ అధికారిగా పని చేస్తున్న రంగస్వామిని సెక్రటేరియట్‌లో రిపోర్టు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

డీఆర్‌వోగా మధుసూదన్‌రావు



రాయచోటి (కలెక్టరేట్), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా రెవెన్యూ అధికారిగా (డీఆర్‌వో) మధుసూదన్‌రావును ప్రభు త్వం నియమించింది. రాష్ట్రవ్యాప్తంగా 26 మంది స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా ఇక్కడికి మధుసూదన్‌రావును బదిలీ చేసింది. ఈయన కర్నూలు జిల్లాలో డీఆర్‌వోగా పనిచేస్తూ బదిలీ పై ఇక్కడికి వస్తున్నారు. ఇక్కడ పనిచేస్తున్న డీఆర్‌వో సత్యనారా యణను అనకాపల్లి డీఆర్‌వోగా బదిలీ చేశారు.

కడప గాన కోకిల మహతి

● లగ్గం సినిమాలో రెండు పాటలు పాడిన గాయని



6



కల్యాణ వైభోగం..

● వైభవంగా వాల్మీకిపురం సీతారాముల కల్యాణం

● పురవీధులలో నగరోత్సవం

6



అందరికీ కందిపప్పు

● సరిపడా చౌక దుకాణాలకు కేటాయింపు

● 1వ తేదీ నుంచి కిలో రూ.67తో అందరికీ పంపిణీ

6

గంజాయి రవాణా, వినియోగంపై ఉక్కుపాదం

● విద్యాసంస్థలపై ప్రత్యేక నిఘా

● త్వరలో 'మన ఊరు-మన పోలీసు' కార్యక్రమం

● ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

పీలేరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గంజాయి అక్రమ రవాణా, వినియోగాన్ని ఉక్కు పాదంతో అణచివేస్తామని ఎస్పీ విద్యాసాగర్ నాయుడు తెలిపారు. గంజాయి మత్తులో పీలేరు పట్టణానికి చెందిన ఇద్దరు యువకులు మంగళవారం రాత్రి రైలు కింద పడి దుర్మరణం చెందిన సంఘటన తెలిసిందే. దీంతో పోలీసులు బుధవారం మధ్యాహ్నం నుంచి పీలేరు పట్టణంలో గంజాయి అక్రమ రవాణా, వినియోగంలో ఉన్న అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఆ విచారణ ప్రక్రియను పర్యవేక్షించేందుకు గురువారం ఎస్పీ పీలేరు పోలీసుస్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా గంజాయిపై రవాణాను నియంత్రించేందుకు కఠిన చర్యలు చేపట్టామని అందులో భాగంగా మదనపల్లె, రాజంపేట, రైల్వేకోడూరు, రాయచోటి పట్టణాల్లో విరివిగా కేసులు నమోదు చేశామని తెలిపారు. పీలేరు ప్రాంతంలోనూ గంజాయి ఆనవాళ్లు ఉన్నట్లు గుర్తించామని, దానిని అడ్డుకునే లోపు ఇద్దరు యువకులు మరణించడం దురదృష్టకరమన్నారు. జిల్లాలోని మెడికల్ షాపులపై వైద్య శాఖాధికారులతో కలిసి ఆకస్మిక తనిఖీలు చేపట్టామన్నారు. పీలేరు ప్రాంతంలోని కలికిరి, వాల్మీకిపురం, గుర్రంకొండ పట్టణాల్లో గంజాయి అక్రమ అమ్మకాలు సాగిస్తున్నట్లు అనుమానాలు ఉన్న వారిపై పటిష్ఠమైన నిఘా పెట్టామన్నారు. గంజాయి అమ్ముతున్నట్లు, సేవిస్తున్నట్లు అనుమానం కలిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, వారు ఇచ్చిన సమాచారం నిజమని తేలితే వారికి నగదు రివార్డు కూడా అందజేస్తామన్నారు. తమ ఇంటి సభ్యులు ఎవరైనా గంజాయికి బానిసలుగా మారి ఉంటే కూడా పోలీసులకు తెలియజేయాలని, అటువంటి వారికి తమ శాఖ తరపున వైద్యం, కౌన్సెలింగ్ ఇస్తామని తెలిపారు. పోలీసులతో ప్రజలను మరింత చేరువ చేసేందుకు త్వరలోనే 'మన ఊరు-మన పోలీసు' కార్యక్రమం ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా సీఐ స్థాయి అధికారి వారంలో నాలుగు రోజులపాటు తమ ప్రాంతంలోని ఏదైనా ఒక గ్రామంలో విధిగా పర్యటించాలని, ఆ సమయంలో ఆయా గ్రామాల్లోని సమస్యలు గుర్తించి వాటి పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. గతంలో నేను పార్వతీపురం జిల్లా ఎస్పీగా పనిచేసినప్పుడు 'మన ఊరు-మన పోలీసు' కార్యక్రమానికి విశేష స్పందన లభించిందన్నారు. ఆ కార్యక్రమం ద్వారా ఆ జిల్లాలో నేరాల సంఖ్య గణనీయంగా తగ్గిందన్నారు. అదే స్ఫూర్తితో ఆ కార్యక్రమాన్ని జిల్లాలో కూడా ప్రారంభిస్తున్నామన్నారు. అనంతరం ఆయన రైలు ప్రమాదంలో మరణించిన యాసీన్ అలీ, కిరణ్‌కుమార్ కుటుంబసభ్యులను పరామర్శించారు. వారికి జరిగిన అన్యాయం మరో కుటుంబానికి జరగకుండా పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నామని వారికి వివరించడమే కాకుండా వారిని ఓదార్చారు. కార్యక్రమంలో పీలేరు అర్బన్ సీఐ యుగంధర్, ఎస్ఐలు బాలకృష్ణ, లోకేశ్, ఏఎస్ఐ హేమసుందర్ జెట్టి, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో 20 మంది

యాసీన్ అలీ, కిరణ్ కుమార్‌ల ఉదంతం తరువాత ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదేశాలతో కదిలిన పీలేరు పోలీసులు హుటాహుటిన పీలేరు ప్రాంతంలో గంజాయి హాట్ స్పాట్స్, దానిని విక్రయిస్తున్న, సేవిస్తున్న 20 మందిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఆ 20 మందిలో గంజాయి విక్రయిస్తున్న వారు ఇద్దరు మాత్రమే ఉండడం, సేవిస్తున్న వారు 18 మంది ఉండడం చూసి పోలీసులే ఆశ్చర్యపోతున్నారు.



యాసీన్ అలీ తండ్రి షరాఫత్ అలీతో మాట్లాడుతున్న ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

కడప గాన కోకిల మహతి

● కడప కళాతోరణంలో మరో ఆణిముత్యం

● లగ్గం సినిమాలో రెండు పాటలు పాడిన గాయని





లగ్గం చిత్రంలో పాటలు పాడిన మహతిని అభినందిస్తున్న హీరో సుమన్



గాయని పి.సుశీలతో మహతి

మనోతో..

లిటిల్ ఛాంప్స్ కార్యక్రమంలో ఎస్పీ శైలజతో

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కడప కళాతోరణంలో ఆ యువతి మరో ఆణిముత్యం. తన గాన మాధుర్యంతో అంచెలంచెలుగా ఎదుగుతూ లగ్గం సినిమాలో రెండు పాటలు పాడి అలరించారు. ఆ ఛాన్స్ కొట్టింది మరెవరో కాదు.. కడప నగరం మోచంపేటకు చెందిన మాజీ కార్పొరేటరు సురేశ్‌బాబు, సౌజన్య కుమార్తె.. మహతి. 20 ఏళ్ల ఆ యువతికి పాటలంటే ప్రాణం. చిన్ననాటి నుంచి శాస్త్రీయ సంగీతంపై మక్కువ ఎక్కువ. బుల్లితెర పోటీల్లోనూ పాల్గొని తన సత్తా చాటుకున్నారు. తన కుమార్తె మక్కువను అర్థం చేసుకున్న తల్లిదండ్రులు గురువు నంద్యాల లలిత చెంత శిక్షణ ఇప్పించారు. ఆమె శిష్యరికంలో ఎన్నో సంగీత మెళకువలు నేర్చుకున్నారు. అనేక సంగీత పోటీల్లో విజేతగా నిలిచారు. కొన్ని సినిమాలకు ఆమె సినీ దర్శకుల సూచనల మేరకు ట్రాక్‌లు పాడారు. ఇటీవల సుబ్బిని ఎంటర్‌ప్రైజెస్ నిర్మిస్తున్న లగ్గం సినిమాలో ఆమెకు రెండు పాటలు పాడే అవకాశం లభించింది. ఒక పాట యుగళగీతం కాగా.. మరొకటి సహగాయనితో కలిసి పాడారు. ఈ సినిమాకు శంకర్ అర్జున్ సంగీతం అందించగా.. రమేశ్ చెప్పల దర్శకత్వం వహించారు. లగ్గం సినిమా ఈ నెల 25న విడుదల కానుంది.

బహుమతులు ఇలా

ఆరేళ్లప్రాయం నుంచి గానంపై మక్కువతో మహతి పాటలు పాడడం ప్రారంభించారు. అనతి కాలంలోనే రాష్ట్రవ్యాప్తంగా వందకు పైగా వేదికలపై గాత్ర కచేరి పోటీల్లో పాల్గొంది. దాదాపు 50కి పైగా గాన పోటీల్లో బహుమతులు అందుకున్నారు.

- 2009లో రాజంపేట స్వరాంజలి సంస్థ నిర్వహించిన రాష్ట్ర స్థాయి పాటల పోటీల్లో ద్వితీయ బహుమతి సాధించారు.
- 2009-10 శ్రీవాణి అర్జున్ నిర్వహించిన అన్నమయ్య త్యాగరాజ సంగీతోత్సవాల్లో ప్రథమ బహుమతి.
- 2009 కడప అహోబిళం మఠం శ్రీ శ్రీ షష్ఠ్యబ్ది సందర్భంగా నిర్వహించిన పోటీల్లో ప్రథమ బహుమతి.
- 2010లో రాజంపేట కళాంజలిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రథమ బహుమతి.
- 2010- 11లో కడప ఆర్టిహోంలో నిర్వహించిన పోటీల్లో ద్వితీయ, ప్రథమ బహుమతులు పొందారు.
- 2011లో ఈటీవీ నిర్వహించిన లిటిల్‌ఛాంప్స్‌లో పాల్గొన్నారు. పాడుతా తీయగా కార్యక్రమంలో కూడా పాల్గొన్నారు.

కీర్తనలంటే ప్రాణం

దేవదేవభజం, ఆరగించి కూర్చున్న నల్లవాడే, ఏ తీరుగనను దయచూచెదవో తదితర అన్నమయ్య, త్యాగయ్య కీర్తనలు, సినిమాల్లో భక్తిరస పాటలంటే మహతికి చాలా ఇష్టం.

విద్యాభ్యాసం

మహతి పాఠశాల విద్యను కడప విద్యామందిర్‌లో పూర్తి చేశారు. ఇంటర్ ఓపెన్ స్కూలులో చదివి బీబీఏ డిగ్రీని విజ్ఞాన్ కళాశాలలో పూర్తి చేశారు. ప్రస్తుతం తిరుపతి పద్మావతి యూనివర్శిటీలో సంగీతంలో ఎంఏ కోర్సును చదువుతున్నారు.

కారు ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి



కలికిరి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వేగంగా వెళుతున్న కారు ఢీకొట్టడంతో ద్విచక్ర వాహనంలో వెళుతున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని యర్రదొడ్డిపల్లె సమీపంలో జరిగింది. కలికిరి పోలీసు ఇన్‌స్పెక్టర్ రెడ్డిశేఖర్‌రెడ్డి వివరాల ప్రకారం.. చిత్తూరు జిల్లా సోమల మండలం టి.చెరుకువారిపల్లెకు చెందిన కోటగుండ్ల కృష్ణయ్య (30) కలకడ టమోట మార్కెట్‌లో పనులు ముగించుకుని బుధవారం రాత్రి 10.30 గంటల సమయంలో ద్విచక్ర వాహనంలో స్వగ్రామానికి బయలుదేరాడు. మార్గ మధ్యంలో కలికిరి నుంచి ఎదురుగా వస్తున్న కారు వేగంగా ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. కారు నడుపుతున్న మహల్‌కు చెందిన షర్ఫుద్దీన్ కారును నిర్లక్ష్యంగా నడుపుతున్న కారణంగానే మోటారు సైకిల్‌ను బలంగా ఢీకొట్టినట్లు సీఐ పేర్కొన్నారు. తీవ్ర గాయాలకు గురైన కృష్ణయ్యను చికిత్స కోసం పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కృష్ణయ్య మృతి చెందినట్లు సీఐ చెప్పారు. మృతుడి భార్య భాగ్యలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెచ్‌సీ జె.రఫీ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రెడ్డిశేఖర్‌రెడ్డి వివరించారు. మృతుడు కృష్ణయ్యకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

అయ్యప్ప భక్తులకు ముస్లింల మధ్యాహ్న 'బిక్ష'



కలికిరి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అయ్యప్పస్వామి దీక్ష చేపట్టిన స్థానిక భక్తులకు గురువారం ముస్లిం సంఘాలు మధ్యాహ్నం బిక్ష ఏర్పాటు చేశాయి. మదనపల్లె రోడ్డులో వున్న ఆంజనేయస్వామి ఆలయంలో ఈ బిక్ష కార్యక్రమాన్ని అయ్యప్పస్వాములకు ఏర్పాటు చేశారు. జమాయత్-ఏ- ఉలేమా జిల్లా కార్యదర్శి ముస్తఫా హజరత్ ఆధ్వర్యంలో స్వాములకు ఈ ఏర్పాట్లు చేశారు. తాము హిందూ, ముస్లింల సంఘీభావం కోసం ప్రతి ఏడాది దీక్షలో వున్న అయ్యప్పస్వాములకు ఆహార సౌకర్యం కలిగిస్తున్నట్లు ముస్తఫా పేర్కొన్నారు. అత్యంత భక్తి శ్రద్ధలతో, కఠిన నియమాలతో చేపట్టిన అయ్యప్పస్వాముల దీక్ష ఫలప్రదం కావాలని కోరుకుంటున్నట్లు ఆయన చెప్పారు. ఇదే సాంప్రదాయాన్ని ఇక మీదట కూడా కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమలో ముస్తఫా హజరత్‌తో పాటు ఖాదర్‌వల్లీ, బాషా, ఇస్మాయిల్, గురుస్వామి, మునిస్వామి, రాజాస్వామి, శంకరస్వామితో పాటు పెద్ద సంఖ్యలో అయ్యప్పస్వాములు పాల్గొన్నారు.

ఆటో ఢీకొని దంపతులకు తీవ్రగాయాలు

రామసముద్రం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఆటో ఢీకొని దంపతులు తీవ్రంగా గాయపడిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. గురువారం మండలంలోని మినికి పంచాయతీ గుంతవారిపల్లెకు చెందిన దంపతులు గోవిందరెడ్డి, లీలావతమ్మ దీపావళి పండుగకు సరుకులు కొనుక్కొని రావాలని గురువారం ద్విచక్రవాహనంలో పుంగనూరుకు బయలుదేరారు. మార్గమధ్యలోని కొత్తూరు క్రాస్ వద్ద ద్విచక్రవాహనాన్ని ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన దంపతులను చికిత్స కోసం మదనపల్లెకు తరలించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు చింతరాచపల్లె విద్యార్థులు




రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఒంటిమిట్ట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతరాచపల్లె జడ్పీ హైస్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఉపాధ్యాయులు తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్పోర్ట్స్ అథారటి స్టేడియం కడపలో జరిగిన జిల్లాస్థాయి నెట్‌బాల్ పోటీల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చింతరాచపల్లె క్రీడాకారులు అద్భుతమైన ప్రతిభ కనబరచి ఐదుగురు క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్-17 విభాగంలో బాలురు ఎం.విజయ్, బాలికల విభాగంలో బి.రమ్య, టి.సుచిత్రలు ఎంపికయ్యారు. వీరు నెల్లూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. అండర్-14లో రోహిణి, అభిలాష్‌లు ఎంపిక కావడం జరిగింది. వీరు వైజాగ్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనున్నారు. ఇటీవల ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో కడపలోని జిల్లా స్టేడియం బాస్కెట్‌బాల్ జరిగిన ఎంపికల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చింతరాచపల్లె క్రీడాకారులు అండర్-17 విభాగంలో జి.ఓబయ్య, బి.లావణ్య ఎంపిక కావడం జరిగింది. అండర్-14లో గౌతమ్ ఎంపిక కావడం జరిగింది. వీరు మదనపల్లెలో జరిగే రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని ఫిజికల్ డైరెక్టర్ పి.వెంకటసుబ్బయ్య తెలియజేశారు. ఎంపికైన క్రీడాకారులను ప్రధానోపాధ్యాయులు పి.గంగరాజు అభినందించారు.

అందరికీ కందిపప్పు !

● సరిపడా చౌక దుకాణాలకు కేటాయింపు

● గత నెల వరకూ అరాకొరా పంపిణీ ● 1వ తేది నుంచి కిలో రూ.67తో అందరికీ



కలికిరి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుదారులందరికీ శుభ వార్త. నవంబరు 1వ తేదీ నుంచి కార్డుదారులందరికీ చౌక దుకాణాల ద్వారా కందిపప్పు అందనుంది. కిలో రూ.67 వంతున ప్రతి కార్డుకు కిలో కందిపప్పును అందజేయనున్నారు. ఇలా కార్డుదారులందరికీ నెల నెలా కందిపప్పు పంపిణీ చేసిన దాఖలాలు గత ఐదేళ్లుగా లేవు. ప్రతి నెలా కేవలం 25 శాతం మాత్రమే పంపిణీ జరిగేది. ఇలా అరాకొర పంపిణీ చేయడంతో ప్రభుత్వం నుంచి అసలు కందిపప్పు సరఫరా లేదని చౌక దుకాణాల యజమానులు బుకాయించడం పరిపాటిగా జరిగేది. ప్రతి నెలా కొంత మందికి మాత్రమే పంపిణీ చేస్తుండటంతో ప్రభుత్వం నుంచి సక్రమంగా సరఫరా కావడం లేదని కార్డుదారులు కూడా సమాధాన పడేవారు. వచ్చే నెల నుంచి ఈ గందరగోళానికి తెరపడనుంది. కార్డుదారులందరికీ ఒకేసారి కందిపప్పు పంపిణీ చేయడానికి పౌర సరఫరాల శాఖ అవసరమైన నిల్వలను సిద్ధం చేసింది. చౌకదుకాణం యజమానులంతా తమకున్న కార్డుల మేరకు కందిపప్పుకు కూడా డీడీలు చెల్లించాలని పురమాయిస్తున్నారు. జిల్లాలో మొత్తం 5,04824 రేషన్ కార్డులున్నాయి. ఈ కార్డుదారులందరికీ సరిపడా 505 టన్నుల కందిపప్పును మండల స్థాయి స్టాకు పాయింట్లలో సిద్ధంగా వుంచారు. ఇక నుంచి చౌకదుకాణాల యజమానులు లేదా ఎండీయూ వాహనదార్లు అందరికీ సరిపడా కందిపప్పు సరఫరా లేదని సాకులు చెప్పే అవకాశం లేదు. ప్రతి కార్డుకూ కిలో వంతున రూ.67ల ధరతో కందిపప్పు తప్పనిసరిగా పంపిణీ చేయక తప్పదు. ఇప్పటికే డీడీలు చెల్లించిన చౌక దుకాణాలన్నింటికీ ఎంఎల్‌ఎస్ పాయింట్ నుంచి అవసరమైన మేరకు కందిపప్పు స్టాకున తరలిస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో కిలో కందిపప్పు ధర రూ.170 వరకూ పలుకుతోంది. దీంతో రేషన్ కార్డుదారులంతా కూడా కందిపప్పు తీసుకోవడానికి ప్రాధాన్యత ఇస్తారని, ఎక్కడయినా కందిపప్పు సరిపడా స్టాకు రాలేదని చెపితే తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పౌర సరఫరా అధికారులు హెచ్చరిస్తున్నారు. అదే విధంగా జిల్లాలో వున్న 39,563 అంత్యోదయ కార్డులకు కార్డుకు కిలో వంతున రూ.13.50 ధరతో చక్కెర కూడా పంపిణీ చేయనున్నారు. ఇక మిగిలిన సాధారణ కార్డులకు అర కిలో వంతున రూ. 17తో అందజేయనున్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



వాల్మీకిపురంలో సీతాలక్ష్మణ సమేత పట్టాభిరాముల నగరోత్సవం



వాల్మీకిపురంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

● పురవీధులలో నగరోత్సవం

వాల్మీకిపురం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పట్టణంలో వెలసిన శ్రీపట్టాభి రామాలయంలో గురువారం టీటీడీ ఆధ్వర్యంలో పునర్వసు సీతారాముల కల్యాణోత్సవ వేడుకలను ఎంతో వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, ఆలయంలోని మూలవర్లకు అభిషేకం, అర్చన, తోమాలసేవలతో ప్రత్యేకపూజలు జరిగాయి. ఆలయంలోని మండపంలో మామిడి తోరణాలు, పుష్పలంధ కరణలతో కల్యాణ వేదిక సిద్ధం చేసి భోగోత్సవ మూర్తులైన సీతారామ లక్ష్మణులకు విశేష అలంకరణలు గావించారు. మంగళ వాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్ఛరణలు, విశేష భక్తజనం నడుమ కల్యాణం కమనీయంగా సాగింది. చివరగా హోమాది కార్యక్రమాలు, పూర్ణాహుతి కార్యక్రమాలు పూర్తి చేసి వేడుకల్లో పాల్గొన్న దంపతులు, భక్తులకు టీటీడీ వస్త్రం, తీర్థప్రసాదాలను అందజేశారు. చివరగా సాయంత్రం విశేష అలంకరణలతో ముస్తాబైన ఉత్సవ మూర్తులను పురవీధులలో నగరోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజు, అర్చకులు అనిల్ స్వామి, భాషిచార్యులు, ఆలయ సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

హార్స్‌లీహిల్స్‌లో అతిథిగృహం పనుల పరిశీలన



అసంపూర్తిగా వున్న హార్స్‌లీహిల్స్‌లోని రెవెన్యూ అతిథిగృహం

బి.కొత్తకోట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పర్యాటక కేంద్రం హార్స్‌లీహిల్స్‌లోని రెవెన్యూ అతిథి గృహం పనులను పూర్తి చేసేందుకు అధికారులు అంచనాల తయారీలో నిమగ్నమయ్యారు. హిల్స్‌పై వున్న పురాతన అతిథి గృహాన్ని తొలగించి, దాని స్థానంలో అధునాతన పద్ధతిలో నూతన భవనాన్ని నిర్మిస్తున్నారు. నిర్మాణం దాదాపుగా పూర్తి కావస్తున్నప్పటికీ ఇంటీరియర్‌వర్క్, వైరింగ్, వుడ్‌వర్క్, పెయింటింగ్, శానిటరీ తదితర పనులు అసంపూర్తిగా వున్నాయి. ఈ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ శ్రీధర్ నుంచి ఆదేశాలు అందడంతో, ఆర్‌అండ్‌బీ ఈఈ అరవిందాదేవి, డీఈ సూర్యనారాయణలు గురువారం హార్స్‌లీహిల్స్‌కు చేరుకొని అతిథి గృహాన్ని పరిశీలించారు. పెండింగ్‌లో వున్న పనులు పూర్తి చేసి భవనాన్ని అందుబాటులోకి తేవడానికి అవసరమైన నిధులపై అంచనాలు సిద్ధం చేసి కలెక్టర్‌కు సమర్పిస్తామని వీరు పేర్కొన్నారు. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభించి పూర్తి చేస్తామన్నారు.

ఎండీయూల వ్యవస్థను రద్దు చేయాలి


● రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దివి లీలామాధవరావు



సమావేశంలో మాట్లాడుతున్న దివి లీలామాధవరావు

మదనపల్లె, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం రేషన్ డీలర్ల వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ తీసుకొచ్చిన ఎండీయూ వ్యవస్థను రద్దు చేయాలని రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దివి లీలామాధవరావు డిమాండ్ చేశారు. స్థానిక సీఎస్‌ఐ కమ్యూనిటీ హాలులో గురువారం రేషన్ డీలర్ల జిల్లా స్థాయి సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ అయిదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో అన్ని వ్యవస్థలకు సమాంతరంగా మరో వ్యవస్థను తీసుకొచ్చి అన్నింటినీ కలుషితం చేసిందని ఆరోపించారు. దీంతో ఏదీ కూడా పూర్తి స్థాయిలో సక్సెస్ కాలేదని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తమ సమస్యల పట్ల సానుకూలంగా ఉన్నారని, అన్నీ త్వరలోనే పరిష్కారం అవుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. 2014-2019 మధ్య కాలంలో రేషన్ డీలర్లకు క్వింటాల్ బియ్యానికి రూ.20 నుంచి రూ.70, ఆ తర్వాత రూ.100కు పెంచిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. అలాగే రంజాన్, సంక్రాంతి, క్రిస్మస్ కానుకనలు అదనంగా ఇవ్వడం ద్వారా ఏడాదికి రూ.18 కోట్లు కమీషన్ రూపంలో డీలర్లకు సమకూరినట్లు గుర్తు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో రేషన్ డీలర్లకు గౌరవ వేతనం రూ.7500, పట్టణ ప్రాంతాల్లో రూ.10 వేలు ఉన్న కమీషన్ను రూ.15 వేలు చేయాలని గతంలో చంద్రబాబు ఇచ్చిన జీవోను అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు బి.గోపాల్ రెడ్డి మాట్లాడుతూ తమ సమస్యలను రాష్ట్ర కమిటీ ద్వారా కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకుందామని పిలుపునిచ్చారు. అంతకు ముందు తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌ఛార్జి దాసరిపల్లె జయచంద్రారెడ్డి, టౌన్ బ్యాంకు మాజీ చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్, ఆర్.జె.వెంకటేష్, ప్రసాద్‌రావు, మొటుకుపల్లె శివ, తదితరులు మాట్లాడారు. సమావేశంలో గుంటూరు జిల్లా కార్యదర్శి పీటీఎల్ వరప్రసాద్, ప్రకాశం జిల్లా అధ్యక్షుడు సుమన్, జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ షేక్ బాషా, మదనపల్లె పట్టణ అధ్యక్షుడు షేక్ ఇమామ్‌ఖాసీం, రూరల్ అధ్యక్షుడు కృష్ణమూర్తి, మురళి, సుధీర్‌బాబు, కళాధర్, వై.అంజనప్ప, కవిత, షేక్ ముంతాజ్‌లతో పాటు జిల్లాలోని మదనపల్లె, రాయచోటి, రాజంపేట రెవెన్యూ డివిజన్ల నుంచి పెద్ద సంఖ్యలో రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా గోపాల్‌రెడ్డి



రేషన్ డీలర్ల సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక సీఎస్‌ఐ ఫంక్షన్ హాలులో గురువారం జరిగిన జిల్లా స్థాయి సర్వసభ్య సమావేశంలో జిల్లా అధ్యక్షుడిగా రెండోసారి బి.గోపాల్‌రెడ్డిని, జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్‌గా షేక్ ఇమాంఖాసీం, ప్రధాన కార్యదర్శిగా షేక్ ఫరీద్‌బాషా, కోశాధికారిగా వి.సుధీర్ బాబు, రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శిగా ముంతాజ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో రామాచార్లపల్లె కృష్ణమూర్తి, జయం మురళి, సుధీర్‌బాబు, కవిత, తదితరులు పాల్గొన్నారు. అనంతరం సమావేశానికి హాజరైన కూటమి నేతలతో పాటు రాష్ట్ర అధ్యక్షుడు లీలామాధవరావును సన్మానించారు.

వర్షంతో దెబ్బతిన్న బొప్పాయి తోటలు

● రూ.కోట్లాది రూపాయల నష్టం ● లబోదిబోమంటున్న రైతాంగం ● ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

రైల్వేకోడూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు బొప్పాయి తోటలు దెబ్బతింటున్నాయి. ఎడతెరిపి లేకుండా వర్షం పడటంతో తోటల్లో నీరు నిలిచింది. వర్షం ఆగిపోయేంత వరకు చెట్లు పచ్చగానే ఉన్నాయి. సూర్యరశ్మి పడే కొద్ది చెట్లు ముడుచుకుపోయాయి. కాయలు తోటల్లోనే మాగడం, బూజు పట్టడం తదితర రకాలుగా దెబ్బతిని పనికి రాకుండా పోతున్నాయి. దీంతో కోట్లాది రూపాయల నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, పుల్లంపేట, చిట్వేలి, పెనగలూరు మండలాల్లో మామిడి, అరటి తర్వాత బొప్పాయి పంట ఎక్కువగా సాగు చేస్తారు. ఈ ఏడాది సుమారు 15వేల హెక్టార్లలో పంట సాగులో ఉంది. ఒక ఎకరాకు సుమారు రూ.50 వేలు పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. దున్న కాలు, ఎరువులు, మొక్కలు, పురుగు మందులు తదితర వాటికి రైతులకు ముందుగానే వ్యాపారులు కొంత డబ్బులు ఇస్తారు. ఈ డబ్బులను పెట్టుబడిగా పెట్టి రైతులు సాగులోకి దిగుతారు. బొప్పాయికి ప్రకృతి వైపరీత్యాలతో పాటు చీడపీడలు ఆశిస్తే మొక్కలు తట్టుకోలేవు. మొక్కలు నాటిన తర్వాత వర్షం కురిస్తే చనిపోతాయి. పెద్ద చెట్లు అయినా చనిపోతాయి. కాయలు దెబ్బతింటాయి. ఎన్ని మందులు పిచికారి చేసినా ఫలితాలు ఉండదు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది వర్షం దెబ్బకు జీవన ఎరువులు, ప్రకృతి వ్యవసాయం, జీవామృతం వంటి ప్రయోగాలు చేసిన రైతుల తోటలు కూడా ముడుచుకుపోయి కాయలు దెబ్బతిన్నాయి. చాలా మందికి పెట్టిన పెట్టుబడి కూడా రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం బొప్పాయి తోటలు దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.



ఉప్పరపల్లెలో ముడుచుకుపోయిన బొప్పాయి చెట్లు



ప్రభుత్వం ఆదుకోవాలి

రైల్వేకోడూరు మండలంలో వర్షం దెబ్బకు చాలా వరకు బొప్పాయి తోటలు తుడిచి పెట్టుకుపోయాయి. వర్షం పడినప్పుడు బాగా పచ్చగానే ఉన్నాయి. వర్షం తగ్గిన కొన్ని రోజులకు మొదట ఆకులు పూర్తిగా ముడుచుకుపోయాయి. కాయలు క్రమేణా దెబ్బతింటున్నాయి. దీంతో పెట్టిన పెట్టుబడి కూడా రాక నష్టపోతున్నాం. ప్రభుత్వం ఆదుకోవాలి.

-కోనేరెడ్డి రామసుబ్బారెడ్డి, ఉప్పరపల్లె, రైల్వేకోడూరు



ప్రతి ఏడాది నష్టపోతున్నాం.

ప్రతి ఏడాది ప్రకృతి వైపరీత్యాలతో బొప్పాయి పంట దెబ్బతిని నష్టపోతున్నాం. ఈ ఏడాది ఎడతెరిపి లేని వర్షం కారణంగా తోటలు దెబ్బతిని నష్టపోతున్నాం. కాయకష్టం చేసినా లాభాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. సాగులో ఎక్కడ రాజీ లేకుండా చేసినా నాసిరకం విత్తనాలతో నష్టపోతున్నాం.

-గుండాల దామోదర్‌రెడ్డి, ఉప్పరపల్లె, రైల్వేకోడూరు

జాతీయ ఉర్దూ సెమినార్‌కు ప్యాట్రన్‌గా అమీర్‌బాబు





అమీర్‌బాబు, సత్తార్‌ఫైజి

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అంజుమన్ తరక్కీ ఉర్దూ జిల్లాశాఖ ఆధ్వర్యంలో నవంబరు 9, 10 తేదీల్లో కడప ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జరగనున్న జాతీయ ఉర్దూ సెమినార్‌కు ప్యాట్రన్‌గా వీఎస్ అమీర్‌బాబు, ఛైర్మన్‌గా సత్తార్‌ఫైజీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంస్థ ప్రధానకార్యదర్శి సయ్యద్ హిదయతుల్లా తెలిపారు. వీరి ఎంపిక పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఆరు సంవత్సరాల తరువాత కడపలో మళ్లీ జాతీయ స్థాయిలో ఉర్దూ సెమినార్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఉర్దూ విద్య, సాహిత్య, సారస్వతిక సమస్యలు పరిష్కారం మన బాధ్యత అన్న అంశంపై దాదాపు 24 మంది పరిశోధకులు తమ పత్రాలు సమర్పించనున్నారు. ఏపీ, తెలంగాణ, కేరళ, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి ప్రముఖ ఉర్దూ సాహితీవేత్తలకు కవులు, రచయితలు సాహితీ విమర్శకులు పాల్గొంటారన్నారు. ఈ రెండురోజుల కార్యక్రమాలు సెమినార్ ప్రారంభోత్సవం, ఉర్దూ సావనీర్ ఆవిష్కరణ, జాతీయ స్థాయిలో కవి సమ్మేళనం వ్యక్తృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందిస్తారని తెలిపారు.

జేఎన్టీయూలో ప్రారంభమైన యంత్ర-2కె24



యంత్ర-2కె24 జాతీయ సదస్సు బుక్‌లెట్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

పులివెందుల రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : స్థానిక జేఎన్టీయూ కళాశాలలో యంత్ర-2కె24 జాతీయ సదస్సు గురువారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ హెడ్ మెకానికల్ టి.చంద్రశేఖర్‌రెడ్డి హాజరై బుక్‌లెట్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి ఎఫ్3 కార్ డిజైన్ మరియు రోబొటిక్స్ పాత్ర ప్రాముఖ్యతను వివరించారు. అలాగే ఈ సదస్సులో హైస్పీడ్ ఎలక్ట్రికల్ వెహికల్ (ఎఫ్3 కార్ మోడల్) మరియు ఐఓటీ విత్ హ్యూమనాయిడ్ రొబొటిక్స్‌పై విద్యార్థులకు మూడు రోజజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ అరుణకాంతి, వైస్ ప్రిన్సిపల్ సుబ్బారెడ్డి, మెకానికల్ విభాగాధిపతి ప్రొఫెసర్ వేణుగోపాల్‌రెడ్డి, దేశం నలుమూలల నుంచి దాదాపు 500 మంది విద్యార్థులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలి



మాట్లాడుతున్న యువజన సర్వీసుల శాఖ కమిషనర్ శారదాదేవి

కడప నాగరాజుపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మంచి అలవాట్లతో ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని విజయవాడ యువజన సర్వీసుల శాఖ కమిషనర్ శారదాదేవి అన్నారు. జిల్లాలో ఆ శాఖ పర్యటనలో భాగంగా గురువారం కడప నగరంలోని వివేకానంద మహిళా డిగ్రీకళాశాలలో వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యక్తిత్వ వికాసం అంటే ప్రతి ఒక్కరూ మంచి అలవాట్లతో ఆరోగ్యం పరిరక్షించుకోవాలని, వారి మనసు చదువు, కళలు, క్రీడలు పట్ల ఏకాగ్రత కలిగి మంచి ఉన్నత స్థితికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం స్టేట్ గెస్ట్‌హౌస్ లో యువజన సంఘ సభ్యులు, స్వచ్ఛంధ సేవా సంస్థలతో యువజన సంఘాల బలోపేతానికి తమ వంతు కృషి చేయాలని కోరారు. స్టెప్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి సాయిగ్రేస్ మాట్లాడుతూ దేశ జనాభాలో యువత 33 శాతం ఉన్నదని, ప్రపంచంలో ఏ ఇతర దేశంలో యువత ఇంత శాతం లేదన్నారు. కళాశాల కరస్పాండెంట్ మనోహర్‌రెడ్డి, ప్రిన్సిపల్ నాగమణి, స్టెప్ మేనేజరు వీవీ సుబ్బరాయుడు, సిబ్బంది అబ్బాస్‌అలీ, నాగయ్య, వీవీ నారాయణ పాల్గొన్నారు.

ఏపీ పర్యావరణ ప్రభావ మదింపు ప్రాధికారిక సంస్థ సభ్యుడిగా డాక్టర్ చంద్రశేఖర్



కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలోని పర్యావరణ ప్రభావ మదింపు ప్రాధికార సంస్థ సభ్యుడిగా వైవీయూ పర్యావరణ శాఖ సహాయాచార్యులు చంద్రశేఖర్ నియమితులయ్యారు. ఈమేరకు సెంట్రల్ గవర్నమెంటు ఎన్విరాన్‌మెంటు ఫారెస్టు అండ్ క్లైమెట్ ఛేంజ్ అడిషనల్ సెక్రటరీ డాక్టర్ అమన్‌దీప్‌గార్గ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీలో ఛైర్మన్‌తో పాటు మెంబరు సెక్రటరీ సభ్యులు కలిసి రాష్ట్రంలో పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తారు.

14 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

● ముగ్గురు స్మగ్లర్లు అరెస్ట్ ● కడప డీఎఫ్ఓ వినీత్‌కుమార్



పట్టుబడిన స్మగ్లర్లు, దుంగలతో డీఎఫ్ఓ వినీత్‌కుమార్, అటవీశాఖ అధికారులు

సిద్దవటం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సిద్దవటం రేంజి గొల్లపల్లె బీట్‌లోని అనుమానాస్పద ప్రాంతాల్లో కూంబింగ్ నిర్వహించి 14 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని ముగ్గురు స్మగ్లర్లను అరెస్ట్ చేసినట్లు డీఎఫ్‌వో వినీత్ కుమార్ తెలిపారు. సిద్దవటం అటవీశాఖ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ గొల్లపల్లె బీట్‌లోని అనుమానాస్పద ప్రాంతమైన సాలుపెంట ప్రదేశంలో అటవీశాఖ సిబ్బంది కూంబింగ్ నిర్వహిస్తుండగా స్మగ్లర్లు 14 ఎర్రచందనం దుంగలు మోసుకుని వెళుతుండగా దాడులు నిర్వహించి చాపాడు మండలానికి చెందిన హబీబుల్లా, తమిళనాడుకు చెందిన గోపీ, తీర్థగిరిలను అరెస్ట్ చేశారన్నారు. చాపాడు మండలానికి చెందిన జాకీర్ అనేవ్యక్తి పరారయ్యాడు. పట్టుబడిన స్మగ్లర్ల వద్ద నుంచి 14 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని అటవీశాఖ కార్యాలయానికి తరలించారన్నారు. పట్టుబడిన దుంగల విలువ సుమారు 1,06,686 రూపాయలు విలువ చేస్తాయన్నారు. ప్రపంచంలోనే అత్యంత విలువైన ఎర్రచదనం ఇతర రాష్ట్రాలకు వెళ్లకుండా కార్యక్రమంలో సబ్‌డీఎఫ్‌వో స్వామివివేకానంద, రేంజర్ కళావతి, డిప్యూటీ రేంజర్ ఓబులేశు, సెక్షన్ అధికారి సురేష్‌బాబు, ఫారెస్ట్ బీట్ అధికారులు మధు, విశ్వనాథ్, పెంచల్‌రెడ్డి, అసిస్టెంట్‌బీట్ అధికారులు హైమావతి, ప్రొటక్షన్ వాచర్‌లు, స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

రాఘవరాజపురంలో చోరీ

30 గ్రాముల బంగారం, రూ. 38 వేల నగదు అపహరించిన దొంగలు

రైల్వేకోడూరు, అక్టోబరు 24:(ఆంధ్రజ్యోతి) మండలంలోని రాఘవరాజపురం గ్రామానికి చెందిన ఈదర పార్థసారథి ఇంటిలో చోరీకి పాల్పడి 30 గ్రాముల బంగారు నగలు, రూ.38 వేల నగదు చోరీ చేశారు. బాధితుడి వివరాల మేరకు.. పార్థసారధి తన కుటుంబ సభ్యులతో కలసి కమలాపురానికి బుధవారం వెళారు. రాత్రి 10 గంటల సమయంలో ఇంటికి వచ్చే సరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉండడం గమనించి... ఇంటిలోకి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న రెండు బంగారు చైన్లు, రెండు చిన్న ఉంగరాలు, ఒక గొలుసు, కమ్మలు, రూ.38వేలు నగదు గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ మేరకు గురువారం రైల్వేకోడూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



కమలాపురం రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కమలాపురం మండల పరిధిలోని కడప - తాడిపత్రి ప్రధాన రహదారిపై పందిళ్లపల్లె వద్ద శ్రీభైరవేశ్వర ఆలయ సమీపంలో గురువారం ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ద్విచక్ర వాహనదారునికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు పోలీసుల సహకారంతో స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కడప రిమ్స్‌కు తరలించారు. క్షతగాత్రుడు మొలకవారిపల్లెకు చెందిన చింతకుంట రవిశంకర్‌రెడ్డి (50)గా పోలీసులు గుర్తించారు. 108 ద్వారా కడప రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడు ఓ సిమెంటు కంపెనీలో ప్రొక్లైనర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నట్లు సమాచారం.

గండికోట నుంచి 6వేల క్యూసెక్కులు విడుదల

కొండాపురం/మైలవరం అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరానికి గురువారం 6000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. కాగా ప్రాజెక్టులోకి జీఎన్ఎస్ఎస్ కాలువ ద్వారా 5,500 క్యూసెక్కుల కృష్ణాజలాలు, వరద నీరు మరో 500 క్యూసెక్కులు దాకా వచ్చి చేరుతున్నట్లు తెలిపారు. అదేవిధంగా మెయిన్‌కెనాల్‌కు 75 క్యూసెక్కుల నీటిని వదులుతున్నామన్నారు.

పెన్నానదికి కొనసాగుతున్న నీటి విడుదల

మైలవరం జలాశయం నుంచి పెన్నానదికి 6 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు డీఈఈ నరసింహమూర్తి తెలిపారు. మైలవరం ఉత్తర కాలువకు 25 క్యూసెక్కులు, దక్షిణ కాలువకు 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. గండికోట నుంచి మైలవరానికి ఇన్‌ఫ్లో పెరిగితే మరింత నీటిని పెన్నానదికి విడుదల చేయడం జరుగుతుందని డీఈఈ తెలిపారు.

చంద్రబాబును కలిసిన గోవర్ధనరెడ్డి, హరిప్రసాద్



కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబును టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు గోవర్ధనరెడ్డి, హరిప్రసాద్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా రాజకీయాలపై చర్చించారు. అలాగే కార్యకర్తలకు అండగా ఉండాలని చంద్రబాబు సూచించినట్లు తెలిపారు.

రైతుల భూసమస్యల పరిష్కారానికి కృషి

● ఇన్‌ఛార్జ్ కలెక్టర్ అతిథిసింగ్



రైతులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ అతిథిసింగ్

బ్రహ్మంగారిమఠం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో రీసర్వేలో రైతన్నలకు పూర్తిస్థాయిలో నష్టం వాటిల్లింది. ఈనేపథ్యంలో ప్రభుత్వం ప్రతి పంచాయతీలో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోంది. గురువారం బ్రహ్మంగారిమఠం మండలంలోని ముడుమాల, మల్లేపల్లె గ్రామ పంచాయతీల్లో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. బద్వేలు డివిజను ఆర్డీవో చంద్ర మోహన్, బి.మఠం తహసీల్దారు దామోదర్‌రెడ్డి పర్యవేక్షణలో చేపట్టిన ఈ సదస్సులకు జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ అతిథిసింగ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతన్నలతో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రీసర్వేలో భూములు కోల్పోయినట్లు తమ దృష్టికి తెస్తే జిల్లా స్థాయి అధికారులతో కమిటీ వేసి గ్రామస్థాయిలో సర్వేలు నిర్వహించి పరిష్కరిస్తామన్నారు. అలాగే గ్రీన్ ఫీల్డ్ హైవే రోడ్ల విస్తరణ పనుల్లో భూములు కోల్పోయిన రైతన్నలకు సత్వరమే నష్టపరిహారం అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు చెన్నుపల్లె సుబ్బారెడ్డి ముడుమాల, మల్లేపల్లె గ్రామ పంచా యతీల్లో భూ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని.. రీసర్వేలో కొందరు రైతులు తమ భూములు కోల్పోయారని తెలిపారు. అలాగే జాతీయ రహదారి పనులు విస్తరణలో భూములు కోల్పోయిన కొంతమందికి మాత్రమే నష్టపరిహారం వచ్చిందని.. మిగిలిన వారికి వెంటనే నష్టపరిహారం అందించాలని ఇన్‌ఛార్జ్ కలెక్టరును కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు జాన్సన్, హైవే రోడ్డు అధికారులు, మాజీ ఎంపీటీసీ రమేశ్, చిలమల నారాయణ, చిలమల నాగయ్య, మస్తాన్, శ్రీను, ముడుమాల పోలిరెడ్డి, సురేంద్రయాదవ్, మేకల సుధాకర్, వెల్లటూరు సాంబశివారెడ్డి, వీరయ్య, సిద్దయ్య పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర సాధనకు ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలి

● అన్నమయ్య జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి(కలెక్టరేట్), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లాకు సంబంధించి స్వర్ణాంధ్ర-2047లోని లక్ష్యాలను సాధించేందుకు అధికారులందరూ కార్యాచరణ ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశించారు. గురువారం సాయంత్రం వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్‌ప్రసాద్, స్వర్ణాంధ్ర-2047పై సమీక్ష సమావేశం నిర్వహించారు. రాయచోటి కలెక్టరేట్ నుంచి కలెక్టర్ చామకూరి శ్రీధర్, జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్ ఈ సమీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్రంలోని 26 జిల్లాలు, 686 మండలాల నుంచి స్వర్ణాంధ్ర-2047పై విజన్‌పత్రాలు అందాయని తెలుపుతూ సంతోషం వ్యక్తం చేశారు. విజన్ పత్రాలను రూపొందించిన అనంతరం జిల్లాలు, మండలాల పనితీరుపై సూచికలను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రధానమంత్రి చేతుల మీదుగా ముఖ్యమంత్రి, ఉప మంత్రివర్యుల సమక్షంలో త్వరలో స్వర్ణాంధ్ర-2047కు సంబంధించిన పూర్తి నివేదికను ప్రజలందరికీ అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ చామకూరి శ్రీధర్, అన్న మయ్య జిల్లాకు సంబంధించిన స్వర్ణాంధ్ర-2047 గురించి మాట్లా డుతూ జిల్లాలో పర్యాటకం, ఫుడ్ ప్రాసెసింగ్, నైపుణ్య అభివృద్ధి తదితర రంగాల్లో మంచి అవకాశాలు ఉన్నాయని.. వీటిని పూర్తి స్థాయిలో వినియోగించుకుంటామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి తెలిపారు. అనంతరం కలెక్టర్ జిల్లా అధికారుల నుద్దేశించి మాట్లాడుతూ స్వర్ణాంధ్ర-2047లో మన జిల్లాకు సంబంధించి నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుని పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలని ఆదేశించారు. డీఆర్‌వో సత్యనారాయణరావు, సీపీవో వెంకట్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సందేహాల నివృత్తికే పెన్షన్, జీపీఎఫ్ అదాలత్

● ప్రిన్సిపల్ అకౌంట్ జనరల్ చంద్రమౌళిసింగ్



ఉద్యోగులకు జీపీఎఫ్ పత్రాలను అందజేస్తున్న చంద్రమౌళి సింగ్

కడప కలెక్టరేట్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల పెన్షన్, జీపీఎఫ్‌లకు సంబంధించి వివిధ సందేహాలను నివృత్తి చేసేందుకే పెన్షన్, జీపీఎఫ్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ చంద్రమౌళి సింగ్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని సభాభవనంలో అకౌంటెంట్ జనరల్ డైరెక్టరేట్ ఆఫ్ ట్రెజరీస్ మరియు అకౌంట్స్‌శాఖల ఆధ్వర్యంలో జిల్లా పరిధిలోని ఉద్యోగుల జీపీఎఫ్, పెన్షన్ సమస్యలపై అదాలత్ కార్యక్రమం జరిగింది. ఈకార్యక్రమానికి డైరెక్టరేట్ ఆఫ్ ఆడిటర్ జనరల్ లలిత్ కుమార్, ట్రెజరీశాఖ డైరెక్టర్ మోహన్‌రావులు పాల్గొన్నార. ఈసందర్భంగా ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ చంద్రమౌళిసింగ్ మాట్లాడుతూ ప్రతి ఒక్క ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ అయిన మరుసటి రోజునే పెన్షన్ మంజూరు చేయాలన్నదే ప్రభుత్వ ముఖ్య ఉద్ధేశ్యమన్నారు. అందుకు సంబంధించి ప్రతి ఉద్యోగి ఆరు నెలల లోపు పెన్షన్‌కి సంబంధించిన అన్ని డాక్యుమెంట్లను ఆశాఖల డీడీలకు పంపాలన్నారు పదవీ విరమణ సమయానికి సర్వీస్ రిజిస్టర్ అప్డేట్ ఉండేలా చూసుకోవడం ఉద్యోగుల బాధ్యత అన్నారు. రిసర్వీసు రిజిస్టర్‌లో అన్ని ఎంట్రీలు కరెక్ట్‌గా ఉండేలా సరిచూసుకోవాలన్నారు. ఎటువంటి లోన్ పెండింగ్ కేసులు ఉండకూడదన్నారు పెన్షన్ డాక్యుమెంట్ అందిన వెంటనే ఏజీ నియమ నిబంధనల ప్రకారం వేగవంతంగా పెన్షన్ మంజూరుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మా నోటీసుకు రాని జీపీఎఫ్, పెన్షన్ సమస్యలు ఇంకా ఏమైనా ఉంటే అదాలత్ దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలన్నారు. ఈ సదస్సు అనంతరం జిల్లా వ్యాప్తంగా పదవీ విరమణ పొందిన పలువురు ఉద్యోగులకు, పెన్షన్ పేమెంట్ ఆర్డర్‌లను అందజేశారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగులకు జీపీఎఫ్ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ అకౌంటెంట్ ఆఫీసర్లు సునీత, చంద్రశేఖర్, భవానీప్రసాద్, విజయ్‌కుమార్, జిల్లా ట్రెజరీశాఖ డీడీ వెంకటేశ్వర్లు, సబ్‌ట్రెజరీ అధికారులు పాల్గొన్నారు.

గత వైసీపీ ప్రభుత్వం నిర్వాకంతోనే యువత డ్రగ్స్ వైపు

● కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి, పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి



డ్రగ్స్ కట్టడికి చర్యలు తీసుకోవాలని ఆవేదన వ్యక్తం చేస్తున్న మహిళ

కడప క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలో కొంత మంది యువకులు గంజాయితో పాటు డ్రగ్స్‌కు అలవాటు పడి జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని.. ఈ దుస్థితి గత వైసీపీ ప్రభుత్వం నిర్వాకంతోనే నెలకొందని కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి, పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి మండిపడ్డారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం వారు మత్తుకు అలవాటు పడ్డ యువకుల తల్లులతో కలిసి ఎస్పీ హర్షవర్ధన్‌రాజుకు ఫిర్యాదు చేశారు. యువకులు మత్తుకు సంబంధించిన ట్యాబ్లెట్లను ఇంజక్షన్ రూపంలో వినియోగించుకుంటున్నారని.. వీటిపై దృష్టిసారించి చర్యలు తీసుకోవాలని ఎస్పీకి విజ్ఞప్తి చేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ డాక్టర్ ప్రిస్కిప్షన్ లేకుండా ట్యాబ్లెట్లు విక్రయిస్తున్నారని రూ.300 విలువ చేసే ట్యాబ్లెట్లు వెయ్యి రూపాయలకు విక్రయిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. నగరంలో గంజాయి డ్రగ్స్ విచ్చలవిడిగా దొరుకుతోందని.. వీటిని వాడిన యువకులతో పాటు మైనరు పిల్లల జీవితాలు నాశనం అవుతున్నాయన్నారు. మత్తుకు బానిసైన యువకుల కుటుంబ సభ్యులు తమ దృష్టికి తీసుకురావడంతో ఎస్పీకి ఫిర్యాదు చేశామని.. ఆయన సానుకూలంగా స్పందించి వాటి నిర్మూలనకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారన్నారు.

మా పిల్లలను రక్షించండి

మా బిడ్డలు మత్తు పదార్థాలకు అలవాటు పడి.. ఆ మత్తులో ఇంట్లో డబ్బులు ఇవ్వాలంటూ నసపెడుతున్నారని.. ఇవ్వలేదంటే కొడుతున్నారని మత్తుకు అలవాటు పడ్డ యువకుల తల్లులు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే పోలీసు అధికారులు చర్యలు తీసుకుని డ్రగ్స్ కట్టడికి చర్యలు తీసుకోవాలని కోరారు.

అన్నమయ్య డ్యాంను పునర్నిర్మించండి

సీఎంను కోరిన కొండూరు శరత్‌కుమార్‌రాజు



సీఎం చంద్రబాబునాయుడును కలిసిన శరత్‌కుమార్‌రాజు తదితరులు

రాజంపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య డ్యామ్‌ను పునర్నిర్మించి రైతాంగాన్ని ఆదుకోవాలని, రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబును రాష్ట్ర క్షత్రియ ఫెడరేషన్ అధ్యక్ష, కార్యవర్గ సభ్యులు కోరారు. అమరావతి సెక్రటేరియట్‌లో ముఖ్యమంత్రిని ఘనంగా సన్మానించిన సమావేశంలో కొండూరు శరత్‌కుమార్‌రాజు సీఎం దృష్టికి ఫెడరేషన్ సంబంధిత విషయాల గురించి, రాజంపేట అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ టీడీ జనార్ధన్, ఫెడరేషన్ ఛైర్మన్ పెద్దబాబు, సెక్రటరి డీఎస్ఎన్ రాజు, ఉపాధ్యక్షులు డాక్టర్ వర్మ, కిరణ్, కార్యవర్గ సభ్యులు రాజాబాబు, ఆంజనేయ రాజు, రామరాజు, రాంబాబు, శివాజీరాజు, రఘురామ రాజు, చిట్టిబాబు, విజయ్, గోపాలకృష్ణరాజు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి నారా లోకేశ్‌ను కలిసిన అనుంపల్లి



మంత్రి నారా లోకేశ్‌ను కలిసిన అనుంపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్‌బాబును బుధవారం రాత్రి గన్నవరం ఎయిర్ పోర్టులో రాయచోటి మండల మాజీ ఉపాధ్యక్షుడు, టీడీపీ నేత అనుంపల్లి రాంప్రసాద్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. రాయచోటి నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలు, నియోజకవర్గ అభివృద్ధికి, రాయచోటి మండల అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని మంత్రిని కోరారు.

ప్రజా సమస్యలు పరిష్కరిస్తున్న చంద్రబాబు

టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని



మంగళగిరి టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో వినతులు పరిశీలిస్తున్న పంతగాని

రైల్వేకోడూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సఫలీకృతులవుతున్నారని టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహప్రసాద్ తెలిపారు. గురువారం మంగళగిరిలోని టీడీపీ ప్రధాన కార్యాలయంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, రాష్ట్ర టూరిజం ఛైర్మన్ కాటసాని బాలాజీతో కలసి ప్రజా సమస్యలపై వినతులు తీసుకున్న ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కంకణం కట్టుకున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో వ్యవస్థలను వాడుకున్నారే గానీ ఏ అభివృద్ధీ చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పింఛన్లు ఆపకుండా ఇస్తున్నారన్నారు. చంద్రబాబు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నారని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అన్నింటినీ నెరవేరుస్తున్నారన్నారు.

మహిళలు ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలి

వెలుగు ఏపీఎం వసుంధర, కెనరా బ్యాంకు మేనేజర్ నందిని



మగ్గం శిక్షణ టూల్‌కిట్స్‌ను పంపిణీ చేస్తున్న కెనరా బ్యాంకు మేనేజర్ నందిని

రైల్వేకోడూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని రైల్వేకోడూరు వెలుగు ఏపీఎం వసుంధర, కెనరా బ్యాంకు మేనేజర్ నందిని తెలిపారు. స్థానిక గిరిజాలేన్‌లో ఉన్న గ్లోబల్ సర్వీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మగ్గం వర్క్ హ్యాండ్ ఎంబ్రాయిడరీలో ఉచిత శిక్షణను ప్రారంభించిన వారు మాట్లాడుతూ మహిళలు వంటింటి కుందేలు కాదని నేటి సమాజంలో నిరూపిస్తున్నారన్నారు. ప్రతి మహిళ చక్కటి ఉపాధి అవకాశాలను ఎంచుకుంటే ఆర్థిక ఇబ్బందులు ఉండవన్నారు. ఇటువంటి శిక్షణ కార్యక్రమాలను వినియోగించుకోవాలని తెలిపారు. బ్యాంకులు ఇచ్చే రుణాలతో మంచి వ్యాపారాలు పెట్టుకుని ఆర్థికంగా ఎదగాలని తెలిపారు. ప్రతి శుభ కార్యానికి మగ్గం డిజైన్స్ కుట్టే వారికి డిమాండ్ ఉంటుందన్నారు. జ్యూట్‌బ్యాగ్స్, కలంకారీ బొమ్మల డిజైన్ లు నేర్చుకోవాలన్నారు. గ్లోబల్ సర్వీస్ ట్రస్ట్ ఛైర్మన్ పార్థసారధి మాట్లాడుతూ తమ ట్రస్ట్ తరపున శిక్షణ పూర్తి చేస్తున్న మహిళలకు ఆర్డర్లను ఇప్పిస్తున్నామని తెలిపారు. శిక్షణకు హాజరైన మహిళలకు ఉచితంగా టూల్‌కిట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కెనరా బ్యాంకు ఆర్సీటీ కో-ఆర్డినేటర్ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత బస్సు ప్రయాణం వెంటనే అమలు చేయాలి

రాయచోటిటౌన్, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయాలని అన్నమయ్య జిల్లా డీసీసీ అధ్యక్షుడు గాజుల భాస్కర్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన కాంగ్రెస్ పార్టీ నేతలతో కలిసి ఆర్టీసీ బస్టాండు నుంచి వేంపల్లి, చిన్నమండెం వెళ్లే పల్లె వెలుగు బస్సులో ప్రయాణించారు. డీసీసీ చీఫ్ సెక్రటరీ అమీర్, ఉపాధ్యక్షుడు దర్బార్, మైనార్టీ నేతలు మన్సూర్‌అలీఖాన్, బావా సర్దార్, అమీర్‌బాషా, మహిళా నేతలు రమణమ్మ, నాగలత, నసీబ్‌జాన్, రమీజా తదితరులు పాల్గొన్నారు.

కోడూరు బస్టాండు వద్ద చేపట్టిన నిరసన

రైల్వేకోడూరు(రూరల్),అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ రైల్వేకోడూరు ఇన్‌చార్జ్ గోశాల దేవి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆదేశాల మేరకు గురువారం రైల్వే కోడూరు ఆర్టీసీ బస్టాండు వద్ద కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేయాలని కోరుతూ నిరసన వ్యక్తం చేశారు. ఆమె మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం రాగానే మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు.

రీసర్వే తప్పులను సవరిస్తాం

రీసర్వేతో ఏర్పడ్డ భూ సమస్యల పరిష్కారానికే గ్రామసభ : తహసీల్దారు





గుండ్లచెరువులో నిర్వహించిన గ్రామసభ - రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ దైవాదీనం

సంబేపల్లె, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): రీసర్వేలో జరిగిన తప్పులను గ్రామసభల ద్వారా గుర్తించి సవరిస్తామని తహసీల్దార్ వెంకటేశ్ తెలిపారు. గురువారం సంబేపల్లె సచివాలయంలో గ్రామసభను ఏర్పాటు చేశారు. గ్రామ సభలో రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించిన ఆయన మాట్లాడుతూ రీసర్వేలో కొన్ని అనివార్య కారణాలతో జరిగిన చిన్న చిన్న తప్పులను సరిచేసుకునే అవకాశం వచ్చిందన్నారు. ప్రతి సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరిస్తామని తెలిపారు. సంబేపల్లెలో 50 వరకు దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ అంచల రామచంద్ర, రెవెన్యూ సిబ్బంది స్రవంతి, ఈశ్వరయ్య, రవి కుమార్, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గువ్వలచెరువులో....

రామాపురం, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): రీసర్వేతో ఏర్పడిన భూ సమస్యల పరిష్కారానికి గ్రామసభ ఏర్పాటు చేశారని తహసీల్దార్ రామాంజులు అన్నారు. గువ్వలచెరువులో 857.13 ఎకరాలు రీ సర్వే చేశారన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలున్నా సభ దృష్టికి తీసుకురావాలని, పరిష్కరించడానికి అధికారులు సిద్దంగా ఉన్నారన్నారు. రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ కృపావతి, ఆర్ఐ, సర్వేయర్, స్థానిక నేతలు హరిప్రసాద్, శివయ్య పాల్గొన్నారు.

గుండ్లచెరువు గ్రామసభలో...

గాలివీడు, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): రీసర్వే సమస్యల పరిష్కారం కోసమే గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఆర్ఐ బాలాజీ పేర్కొన్నారు. గుండ్లచెరువు గ్రామసభలో ఆయన మాట్లాడుతూ విస్తీర్ణ వ్యత్యాసం, సహసంబంధ సవరణ, జాయింట్ ఫీల్డ్ విభజన, మ్యుటేషన్ సమస్యలు, పట్టాదారు పేరు నమోదు సమస్యల అర్జీలను స్వీకరించడం, వాటిని పరిష్కరిస్తామన్నారు. సర్వేయర్లు, వీఆర్ఏ, వీఆర్ఓ, రైతులు, ప్రజలు, పాల్గొన్నారు.

బైరవగుట్టలో....

సుండుపల్లె, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని తహసీల్దార్ దైవాదీనం తెలిపారు. బైరవగుట్ట ఆంజనేయస్వామి ఆలయంలో రీసర్వేలో భూ సమస్యల పరిష్కారానికి నిర్వహించిన గ్రామసభలో రైతులు వినతి పత్రాలను అందజేశారు. ఆర్ఐ శ్రీనివాసులు, సర్వేయర్లు వెంకటసుబ్బయ్య, కీర్తన, జగదీశ్‌రెడ్డి, యోగానందరెడ్డి, వీఆర్ఓ విజయలక్ష్మి, టీడీపీ, బీజేపీ నేతలు శివ రాంనాయుడు, రామాజగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

నట్టల నివారణ మందు సద్వినియోగం చేసుకోండి



టీకా వేస్తున్న డివిజనల్ ఉపసంచాలకులు మాలకొండయ్య

చిన్నమండెం, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): చిన్నర్సుపల్లెలో 2,250 గొర్రెలకు నట్టల నివారణ మందును తాపించినట్లు పశువైద్యులు గణేశ్ తెలిపారు. రాయచోటి డివిజన్ ఉపసంచాలకులు మాలకొండయ్య క్షేత్ర స్థాయిలో పర్యటించి గొర్రెల కాపర్ల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సలహాలను వివరించారు. ఏడీ శ్రీధర్‌రెడ్డి, రవికుమార్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

రామాపురం, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): మారుమూల గ్రామాల్లో ఏర్పాటు చేసే ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కింగ్ హాస్పిటల్ వైద్యులు రుబీనా, హాజీరా అన్నారు. నీలకంఠ్రావుపేట మసీదు సందులో వైద్య శిబిరాన్ని ప్రారంభించిన వారు మాట్లాడుతూ పేదల ఆరోగ్యం కోసం హాస్పిటల్ యాజమాన్యంతో మాట్లాడి వైద్య శిబిరం ఏర్పాటు చేయడంలో మండల మైనార్టీ నేత ఆయూబ్‌ఖాన్ కృషి అభినందనీయమన్నారు. డాక్టర్ రుబీనా, డాక్టర్ హాజీరాను స్కూల్ కమిటీ ఛైర్మెన్ సయ్యద్ పీర్ సత్కరించారు. శిబిరంలో 200 మందికిపైగా పరీక్షలు, చికిత్స చేయించుకున్నారు. ఏఎన్ఎం శశికళ, ఆశావ ర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

న్యూట్రిషన్ ఫుడ్ ఆవశ్యకతపై అవగాహన అవసరం

రాజంపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): న్యూట్రిషన్ ఫుడ్ ఆవశ్యకతపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎస్ఎం బాషా పేర్కొన్నారు. రాజంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో న్యూట్రిషన్ ఫుడ్ ఆవశ్యకతపై సర్టిఫికెట్ కోర్సు శిక్షణలో ఆయన మాట్లాడుతూ జువాలజీ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో న్యూట్రిషన్ ఫుడ్ కోర్సుపై సర్టిఫికెట్ కోర్సు శిక్షణ నిర్వహించడం మంచిదన్నారు. ఇలాంటి సర్టిఫికెట్ కోసం చదవడంతో న్యూట్రిషన్‌ఫుడ్ ఆవశ్యకత తెలుస్తుందన్నారు. నిత్య జీవితంలో మనం ఎలాంటి ఆహారం తీసుకోవాలో తెలుస్తుందన్నారు. సృజనాత్మక రైతు అవార్డు గ్రహీత ఆకేపాటి వరప్రసాద్‌రెడ్డి, బోటనీ హెడ్ బి.ఆదినారాయణ, అధ్యాపకులు సుజాత, హనుమంతరావు ప్రసంగించారు. శిక్షణ తరగతుల్లో పాల్గొన్నవారికి సర్టిఫికెట్లు అందజేశారు.

ప్రజల్లో ఆధ్యాత్మిక చైతన్యం అవసరం

ఒంటిమిట్ట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రజల్లో ఆధ్యాత్మిక చైతన్యం అవసరమని అన్నమయ్య జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేష్ అన్నారు. గురువారం అరుంధతికాలనీలో నిర్వహిస్తున్న మాతమ్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలకు హాజరైన ఆయనకు ఆలయకమిటీ ఘనంగా స్వాగతం పలికి ఆలయ ప్రదక్షిణగావించి గ్రామోత్సవానికి సిద్ధంగా ఉన్న మాతమ్మ రాతి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి గ్రామంలో దేవాలయాల్లో ధూప, దీప, నైవేద్యాలు నిర్వహించడం ద్వారా ప్రజల్లో దేవునిపై భక్తిభావం పెరుగుతుందన్నారు. నిత్యం భగవాన్ నామస్మరణతో మనసు ప్రశాంతత నెలకొంటుందన్నారు. రాష్ట్ర గుర్తింపు పొందిన రామాలయం ఒంటిమిట్టలో ఉండడం ఈ ప్రాంతాన్ని ఆధ్యాత్మికంగా అభివృద్ధి చేపట్టేందుకు బీజేపీ నిరంతరం కృషి చేస్తుందన్నారు. బీజేపీ మండల అధ్యక్షులు బాలరాజు శివరాజు, కార్యదర్శి పేరూరు కొండయ్య, టీడీపీ మండల కార్యదర్శి బొబ్బిలి రాయుడు, నేతలు రఘురామిరెడ్డి, గంగిరెడ్డి పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న ఎస్ఐ భక్తవత్సలం

సంబేపల్లె, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): సైబర్ మోసాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సంబేపల్లె ఎస్ఐ భక్తవత్సలం సూచించారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా పోలీసుశాఖ ఆధ్వర్యంలో జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు అవగాహన చేపట్టారు. సైబర్ నేరాలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ పరికరాల ఆధారంగా జరిగే మోసాలను సైబర్ నేరాలుగా చెప్పవచ్చన్నారు. సెల్‌ఫోన్‌లకు వచ్చే మెసేజ్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ఫోన్‌లో వచ్చే అనవసరమైన లింక్‌లను నొక్కరాదన్నారు. ఈ విషయాలు తల్లిదండ్రులకు, చుట్టుపక్కల వారికి చెప్పి చైతన్యం తీసుకురావాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మడి తాటి నరసింహారెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ సుబ్బయ్య, కానిస్టేబుల్ శివయ్య, జిల్లా సైన్స్ అధికారి ఓబుల్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

సైబర్ క్రైంపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలి

సిద్దవటం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ హర్షవర్ధన్ ఆదేశాలతో సిద్దవటం జిల్లా పరిషత్ హైస్కూల్లో పోలీసు అమరుల వారోత్సవాలు జరిగాయి. ఎస్ఐ చిరంజీవి మాట్లాడుతూ సైబర్ క్రైమ్‌పై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. వ్యాసరచన పోటీలు, వక్తృత్వ, స్పీచ్ పోటీలను నిర్వహించారు. ముగ్గురు విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీరాములు, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాగు, తాగునీటిని అందించాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు



జగనన్న కాలనీలో సమస్యలు పరిశీలిస్తున్న సీపీఐ నేతలు

సుండుపల్లె, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ పాలకుల నిర్లక్ష్యంతో ఇబ్బందులు పడుతున్న రైతులు, ప్రజలు సాగు, తాగునీటి కష్టాలు తీర్చాలని సీపీఐ అన్నమయ్య జిల్లా కార్యదర్శి నరసింహులు తెలిపారు. అక్కంపల్లి జగనన్న కాలనీలో సీపీఐ నేతలతో కలిసి సందర్శించిన ఆయన మాట్లాడుతూ తాగునీటిని అందించే రోళ్లమడుగు నీటి పథకాన్ని జగన్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. 60 శాతం పనులు పూర్తి అయినా ఐదేళ్లలో కనీసం పట్టించుకోలేదని విమర్శించారు. ఝరికోన ప్రాజెక్టు నుంచి సుండుపల్లె రైతాంగానికి సాగునీటి కాల్వలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాయచోటి, సుండుపల్లె డబుల్ రోడ్డు నిర్మాణం పనులు ఆగిపోయాయని రోడ్డు పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు జగనన్న కాలనీ సమీప గిరిజనులకు పైపులైన్ కట్ చేసి నీరు పోకుండా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాడ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఎంపిక చేశారు. మండల కార్యదర్శిగా నవీన్‌కుమార్, సహాయ కార్యదర్శిగా శివాజీని ఎంపిక చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విశ్వనాధ్‌నాయక్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంపై ఆరా తీసిన అధికారులు

రైల్వేకోడూరు(రూరల్),అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మైసూరివారిపల్లె పంచాయితీ రాజానగర్ ప్రధానదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాద స్థలాన్ని జిల్లా రవాణాశాఖాధికారి ప్రసాద్, నేషనల్ హైవే అథారిటీ అధికారి మనోజ్, రాజంపేట ఎంవీఐ బి. వినోద్‌కుమార్, రైల్వేకోడూరు సీఐ హేమసుందర్‌రావు పరిశీలించారు. రోడ్డు ప్రమాదం ఎలా జరిగింది, అతివేగమా, గుంతలు ఉన్నాయా అనే విషయాలపై సమగ్రంగా ఆరా తీశారు. వేగ నిరోధకాల బోర్డులు ఏర్పాటు చేయాలని, పడి గుంతలు పూడ్చడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

చిన్నమండెం, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): చాకిబండ దళితవాడ తాగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ అన్నమయ్య జిల్లా నేత మావులూరి విశ్వనాద్ డిమాండ్ చేశారు. గురువారం దళితవాడ ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను అడిగి తెలుసుకున్న ఆయన మాట్లాడుతూ నాలుగు నెలలుగా తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి బోరు వేయించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ నేతలు రమణ, స్థానికులు భరత్, రామాంజి పాల్గొన్నారు.

పర్యావరణ రక్షణ అందరి బాధ్యత

పెనగలూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని రక్షించుకోవడం మనందరి బాధ్యత అని ఎస్ఐ రవిప్రకాష్‌రెడ్డి సూచించారు. బుధవారం సాయంత్రం పెనగలూరు ఎస్సీ హాస్టల్ విద్యార్థులతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం వల్ల పర్యావరణాన్ని కాపాడినట్లే అన్నారు. మానవాళికి ఉపయోగకరమైన చెట్లను పెంచాలన్నారు. వృథా నీరు భూముల్లోకి ఇంకిపోయేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు.

అనాథ పిల్లలను దత్తత తీసుకోండి

రామాపురం, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులను కోల్పోయిన, అనాథ పిల్లలను దత్తత తీసుకుని వారికి కుటుంబ విలువలను తెలియజేయాలని అన్నమయ్య జిల్లా శిశు గృహ మేనేజర్ సుప్రియ అన్నారు. వెలుగు కార్యాలయంలో జిల్లా శిశు గృహ ప్రత్యేక దత్తత విభాగం ఆధ్వర్యంలో 'అనాథ బాల బాలికల సంరక్షణ' అంశంపై నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ పిల్లలను ఎలా దత్తత తీసుకోవాలనే ప్రక్రియపై తల్లిదండ్రులు లేని పిల్లలకు కుటుంబ విలువలు తెలియపర్చడం ఉద్దేశమన్నారు. వెలుగు ఏపీఎం దేవసేన, శిశుగృహ సోషల్ వర్కర్స్ గాయత్రి, నీడ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ కౌన్సిలర్, సిబ్బంది, వీఓ సభ్యులు, డ్వాక్రా మహిళలు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

సుండుపల్లె, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): అయ్యప్ప, గోవింద మాలధారణ భక్తులకు అన్నదానం నిర్వహించారు. విరూపాక్ష చెన్నకేశవస్వామి ఆలయంలో 21వ తేదీ నుంచి 75 రోజుల పాటు అన్నదానం నిర్వహిస్తున్నామన్నారు. దాతల సహకారంతో అన్నదానం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. నిర్వాహకులు రెడ్డెయ్య రాజు, ధనుంజయరెడ్డి, రాజా, ధర్మరాజు, భగీరధరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం మహాసభలను విజయవంతం చేయాలి

రాజంపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాయచోటిలో 27న జరిగే సీపీఎం జిల్లా ప్రథమ మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కమిటీ సభ్యులు చిట్వేలి రవికుమార్, పందికాళ్ల మణి కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడుతూ ఆదివారం ఉదయం 10 గంటలకు ర్యాలీ, 11 గంటలకు బహిరంగ సభ ఉంటుందన్నారు. జిల్లాలోని కార్మిక సమస్యలు, రైతాంగ సమస్యలు, గ్రామీణ ఉపాధి సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలను తనచేతుల్లోకి తీసుకుని అన్నిరంగాల్లో కార్మికులను, ప్రజలను రాజకీయ వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. జిల్లా నలుమలూల నుంచి అధిక సంఖ్యలో హాజరై మహాసభను విజయంతం చేయాలని వారు కోరారు.

తహసీల్దారు కార్యాలయం ఆకస్మిక తనిఖీ

రాజంపేట టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాజంపేట తహసీల్దారు కార్యాలయాన్ని సబ్‌కలెక్టర్ నైదియాదేవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పారిశ్రామికవాడ స్థల కేటాయింపు మ్యాప్‌ను పరిశీలించారు. కలెక్టర్ శ్రీధర్‌కు ఏపీఐఐసీ భూములు ఆక్రమణకు గురయ్యాయని, వాటిపై విచారించి వెంటనే ఆ భూములను పరిరక్షించాలని టీఎన్ఎస్ఎఫ్ నేతలు ఫిర్యాదు చేయడంతో కలెక్టర్ సబ్‌కలెక్టర్ నైదియాదేవికి అప్పజెప్పారు. ఏపీఐఐసీ భూములపై కార్యాలయంలో వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఇరిగేషన్ భూములను కాపాడాలి

రైల్వేకోడూరు(రూరల్), అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఇరిగేషన్ భూములు కాపాడాలని వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు పండుగోల మణి, సీపీఐ ఏరియా కార్యదర్శి జ్యోతి చిన్నయ్య, డీహెచ్‌పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దార్ల నాగేశ్వర్‌రావు డిమాండ్ చేశారు. రైల్వేకోడూరు ఇరిగేషన్ శాఖ డీఈ విదనోద్‌కుమార్‌కు వినతి పత్రం అందజేసిన వారు మాట్లాడుతూ కబ్జాకు గురైన నదీపోరంబోకు స్థలాలను తొలగించి చర్యలు తీసుకోవాలన్నారు.

వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

లక్కిరెడ్డిపల్లె అక్టోబర్(ఆంధ్రజ్యోతి) 24: వర్షాకాలం గ్రామాల్లో విషజ్వరాలు ప్రబలే అవకాశాలు ఉన్నాయని వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండయ్య సూచించారు. గురువారం దేవళంపల్లె, కోనంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేసిన ఆయన మాట్లాడుతూ వారానికి రెండు సార్లు గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి 104 ద్వారా గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి బీపీ, షుగర్, జ్వరాలు రక్త పరీక్ష నమూనాలను సేకరించి ఉచితంగా మందులు అందించాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డాక్టర్లకు సూచించారు. డాక్టర్లు సమయపాలన పాటించి ఆస్పత్రికి అందుబాటులో ఉండి రోగులకు సేవలు అందించాలన్నారు. డాక్టర్లు, సిద్దయ్య, నజియా, సుమలత, రిజ్వాన్, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎండీసీ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం



ఎమ్మెల్యే, ఇన్‌చార్జిలకు సమస్యలు వివరిస్తున్న ఏపీఎండీసీ కార్మిక నేతలు

ఓబులవారిపల్లె, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఏపీఎండీసీ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని, ఎమ్మెల్యే శ్రీధర్, టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి హామీ ఇచ్చారు. కొన్నేళ్లుగా నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఏపీఎండీసీ ట్రైనింగ్, కార్మిక పోరాట సంఘం నేతలు ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జికి సమస్యలను విన్నవించారు. సంస్థలో అనేక ఏళ్లగా దసరా పండుగకు కార్మికులకు యాజమాన్యం ఇస్తున్న యూనిఫాం డబ్బు ఇంతవరకూ ఇవ్వలేదని, దీపావళి లోపు ఇవ్వాల్సిన ప్రాఫిట్ షేర్ ఇవ్వలేదని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఎండీతో మాట్లాడి న్యాయం చేస్తామని వారు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ ఆర్.వెంకటేశ్, వర్కర్స్ యూనియన్ నేతలు బండారు భాస్కర్, పోరాట కమిటీ జేఏసీ నేతలు, కార్మికులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరం

ఒంటిమిట్ట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పరిసరాలు శుభ్రం ద్వారా వ్యాధులకు దూరంగా ఉండవచ్చని పంచాయతీ సెక్రటరి సుధాకర్ అన్నారు. పెద్దకొత్తపల్లె, చెంచుగారిపల్లె, ఒంటిమిట్ట గ్రామాల్లో పెద్దఎత్తున బ్లీచింగ్, శానిటేషన్ చేపట్టారు. రోడ్లపై చెత్తను వేయకూడదని, ఇంటినుంచే చెత్త సేకరణ చేపడతారని, రోడ్లపై మురుగునీరు వదలడం చేపడితే కఠినచర్యలు చేపడతామన్నారు. ప్రతిఒక్కరూ గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు.

భూకబ్జాను అడ్డుకున్న రెవెన్యూ సిబ్బంది

సిద్దవటం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): శాఖరాజుపల్లె రెవెన్యూ పొలం సర్వేనంబరు 246 లో గురువారం మొహిద్దీన్‌పల్లె వాసి ఎక్స్‌కవేటర్‌తో ఎకరా ప్రభుత్వ భూమిని చదును చేస్తున్నట్లు సమాచారం అందుకున్న రెవెన్యూ సిబ్బంది భూకబ్జాను అడ్డుకున్నారు. కార్యక్రమంలో వీఆర్ఏ వెంకటసుబ్బయ్య, సచివాలయ సర్వేయర్ పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ సేవలు సద్వినియోగం చేసుకోండి

సిద్దవటం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లె పంచాయతీ బాకరాపేట సచివాలయంలో ఆధార్ సేవలు పొందారు. కార్యదర్శి రాజేష్ మాట్లాడుతూ పంచాయతీ పరిధి ప్రజలందరూ ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 8 ఏళ్లలోపు పిల్లలకు కొత్త ఆధార్‌కార్డు తీస్తారన్నారు. ఫోన్ నంబరుకు మొబైల్ లింకు, డేట్ ఆఫ్ బర్త్ ఛేంజ్, నేమ్ కరెక్షన్, అడ్రస్సు మార్పు లాంటి సేవలు తాత్కాలిక ఆధార్ సెంటర్‌లో చేస్తున్నారని, శుక్రవారం కూడా ఉంటుందని ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసకోవాలని వారు తెలిపారు. డిజిటల్ అసిస్టెంట్ శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలకు పాలకవర్గం ఆమోదం

సిద్దవటం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): టక్కోలి సచివాలయంలో పంచాయతీ సమావేశంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు సభ్యులు ఆమోదం తెలిపారు. సమావేశంలో సర్పంచ్ లక్ష్మీదేవి మాట్లాడుతూ పంచాయతీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. అభివృద్ధి కార్యక్రమాలకు సభ్యులు ఆమోదం తెలిపినందుకు కృతజ్ఞతలు తెలిపారు. సెక్రటరి శివయ్య మాట్లాడుతూ పంచాయతీలోని ఎస్టీ కాలనీ తాగునీటి పైపులైనుకు రూ.2 లక్షలు, దేగనవారిపల్లెలో సీసీ రోడ్ల మరమ్మతులకు, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం పునరుద్ధరణకు, హరిత రాయబారులకు వేతనాలు చెల్లింపులకు, పాలకవర్గం ఆమోదం తెలిపింది. టీడీపీ పార్లమెంట్ కార్యదర్శి నాగమునిరెడ్డి, సాంబశివారెడ్డి, ఉద్యోగులు పాల్గొన్నారు.

కడప గాన కోకిల మహతి



- కడప కళాతోరణంలో మరో ఆణిముత్యం
- లగ్గం సినిమాలో రెండు పాటలు పాడిన గాయని



లగ్గం చిత్రంలో పాటలు పాడిన మహతిని అభినందిస్తున్న హీరో సుమన్

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కడప కళాతోరణంలో ఆ యువతి మరో ఆణిముత్యం. తన గాన మాధుర్యంతో అంచెలంచెలుగా ఎదుగుతూ లగ్గం సినిమాలో రెండు పాటలు పాడి అలరించారు. ఆ ఛాన్స్ కొట్టింది మరెవరో కాదు.. కడప నగరం మోచంపేటకు చెందిన మాజీ కార్పొరేటరు సురేశ్‌బాబు, సౌజన్య కుమార్తె.. మహతి. 20 ఏళ్ల ఆ యువతికి పాటలంటే ప్రాణం. చిన్ననాటి నుంచి శాస్త్రీయ సంగీతంపై మక్కువ ఎక్కువ. బుల్లితెర పోటీల్లోనూ పాల్గొని తన సత్తా చాటుకున్నారు. తన కుమార్తె మక్కువను అర్థం చేసుకున్న తల్లిదండ్రులు గురువు నంద్యాల లలిత చెంత శిక్షణ ఇప్పించారు. ఆమె శిష్యరికంలో ఎన్నో సంగీత మెళకువలు నేర్చుకున్నారు. అనేక సంగీత పోటీల్లో విజేతగా నిలిచారు. కొన్ని సినిమాలకు ఆమె సినీ దర్శకుల సూచనల మేరకు ట్రాక్‌లు పాడారు. ఇటీవల సుబ్బిసి ఎంటర్‌ప్రైజెస్ నిర్మిస్తున్న లగ్గం సినిమాలో ఆమెకు రెండు పాటలు పాడే అవకాశం లభించింది. ఒక పాట యుగళగీతం కాగా.. మరొకటి సహగాయనితో కలిసి పాడారు. ఈ సినిమాకు శంకర్ అర్జున్ సంగీతం అందించగా.. రమేశ్ చెప్పల దర్శకత్వం వహించారు. లగ్గం సినిమా ఈ నెల 25న విడుదల కానుంది.

బహుమతులు ఇలా

ఆరేళ్లప్రాయం నుంచి గానంపై మక్కువతో మహతి పాటలు పాడడం ప్రారంభించారు. అనతి కాలంలోనే రాష్ట్రవ్యాప్తంగా వందకు పైగా వేదికలపై గాత్ర కచేరి పోటీల్లో పాల్గొంది. దాదాపు 50కి పైగా గాన పోటీల్లో బహుమతులు అందుకున్నారు.

- 2009లో రాజంపేట స్వరాంజలి సంస్థ నిర్వహించిన రాష్ట్ర స్థాయి పాటల పోటీల్లో ద్వితీయ బహుమతి సాధించారు.
- 2009-10 శ్రీవాణి అర్జున్ నిర్వహించిన అన్నమయ్య త్యాగరాజ సంగీతోత్సవాల్లో ప్రథమ బహుమతి.
- 2009 కడప అహోబిళం మఠం శ్రీ క్రి ష్ణా ష్ట మి సందర్భంగా నిర్వ హించిన పోటీల్లో ప్రథమ బహుమతి.
- 2010లో రాజంపేట కళాంజలిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రథమ బహుమతి.
- 2010- 11లో కడప ఆర్తిహోంలో నిర్వహించిన పోటీల్లో ద్వితీయ, ప్రథమ బహుమతులు పొందారు.
- 2011లో ఈటీవీ నిర్వహించిన లిటిల్‌ఛాంప్స్‌లో పాల్గొన్నారు. పాడుతా తీయగా కార్యక్రమంలో కూడా పాల్గొన్నారు.



గాయని పి.సుశీలతో మహతి

మనోతో..

లిటిల్‌ఛాంప్స్ కార్యక్రమంలో ఎస్పీ శైలజతో

కీర్తనలంటే ప్రాణం

దేవదేవభజం, అరగించి కూర్చున్న నల్లవాడే, ఏ తీరుగనను దయచూచెదవో తదితర అన్నమయ్య, త్యాగయ్య కీర్తనలు, సినిమాల్లో భక్తిరస పాటలంటే మహతికి చాలా ఇష్టం.

విద్యాభ్యాసం

మహతి పాఠశాల విద్యను కడప విద్యామందిర్‌లో పూర్తి చేశారు. ఇంటర్ ఓపెన్ స్కూలులో చదివి బీటీఏ డిగ్రీని విజ్ఞాన్ కళాశాలలో పూర్తి చేశారు. ప్రస్తుతం తిరుపతి పద్మావతి యూనివర్శిటీలో సంగీతంలో ఎంఏ కోర్సును చదువుతున్నారు.

కారు ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి



కలికిరి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వేగంగా వెళుతున్న కారు ఢీకొట్టడంతో ద్విచక్ర వాహ నంలో వెళుతున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన మండ లంలోని యర్ర దొడ్డిపల్లె సమీ పంలో జరిగింది. కలికిరి పోలీసు ఇన్‌స్పెక్టర్ రెడ్డిశేఖర్‌రెడ్డి వివరాల ప్రకారం.. చిత్తూరు జిల్లా సోమల మండలం టి.చెరుకువారిపల్లెకు చెందిన కోటగుండ్ల కృష్ణయ్య (30) కలకడ టమోట మార్కెట్‌లో పనులు ముగించుకుని బుధవారం రాత్రి 10.30 గంటల సమయంలో ద్విచక్ర వాహ నంలో స్వగ్రామానికి బయలుదేరాడు. మార్గ మధ్యంలో కలికిరి నుంచి ఎదురుగా వస్తున్న కారు వేగంగా ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. కారు నడుపుతున్న మహల్‌కు చెందిన షర్ఫుద్దీన్ కారును నిర్లక్ష్యంగా నడుపుతున్న కారణంగానే మోటారు సైకిల్‌ను బలంగా ఢీకొట్టినట్లు సీఐ పేర్కొన్నారు. తీవ్ర గాయాలకు గురైన కృష్ణయ్యను చికిత్స కోసం పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కృష్ణయ్య మృతి చెందినట్లు సీఐ చెప్పారు. మృతుడి భార్య భాగ్యలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెచ్‌సీ జె.రఫీ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రెడ్డిశేఖర్‌రెడ్డి వివరించారు. మృతుడు కృష్ణయ్యకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

అయ్యప్ప భక్తులకు ముస్లింల మధ్యాహ్న 'బిక్ష'



కలికిరి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప స్వామి దీక్ష చేపట్టిన స్థానిక భక్తులకు గురువారం ముస్లిం సంఘాలు మధ్యాహ్నం బిక్ష ఏర్పాటు చేశాయి. మదనపల్లె రోడ్డులో వున్న ఆంజనేయ స్వామి ఆలయంలో ఈ బిక్ష కార్యక్రమాన్ని అయ్యప్పస్వాములకు ఏర్పాటు చేశారు. జమాయత్-ఏ- ఉలేమా జిల్లా కార్యదర్శి ముస్తఫా హజరత్ ఆధ్వర్యంలో స్వాములకు ఈ ఏర్పాట్లు చేశారు. తాము హిందూ, ముస్లింల సంఘీభావం కోసం ప్రతి ఏడాది దీక్షలో వున్న అయ్యప్పస్వాములకు ఆహార సౌకర్యం కలిగిస్తున్నట్లు ముస్తఫా పేర్కొన్నారు. అత్యంత భక్తి శ్రద్ధలతో, కఠిన నియమాలతో చేపట్టిన అయ్యప్పస్వాముల దీక్ష ఫలప్రదం కావాలని కోరుకుంటున్నట్లు ఆయన చెప్పారు. ఇదే సాంప్రదాయాన్ని ఇక మీదట కూడా కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమలో ముస్తఫా హజరత్‌తో పాటు ఖాదర్‌వల్లీ, బాషా, ఇస్మాయిల్, గురుస్వామి, మునిస్వామి, రాజాస్వామి, శంకరస్వామితో పాటు పెద్ద సంఖ్యలో అయ్యప్పస్వాములు పాల్గొన్నారు.

ఆటో ఢీకొని దంపతులకు తీవ్రగాయాలు

రామసముద్రం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఆటో ఢీకొని దంపతులు తీవ్రంగా గాయపడిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. గురువారం మండలంలోని మినికి పంచాయతీ గుంతవారి పల్లెకు చెందిన దంపతులు గోవిందరెడ్డి, లీలావతమ్మ దీపావళి పండుగకు సరుకులు కొనుక్కొని రావాలని గురువారం ద్విచక్రవాహనంలో పుంగనూరుకు బయలుదేరారు. మార్గమధ్యలోని కొత్తూరు క్రాస్ వద్ద ద్విచక్రవాహనాన్ని ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన దంపతులను చికిత్స కోసం మదనపల్లెకు తరలించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు చింతరాచపల్లె విద్యార్థులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఒంటిమిట్ట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతరాచపల్లె జడ్పీ హైస్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఉపాధ్యాయులు తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్పోర్ట్స్ ఆథారిటి స్టేడియం కడపలో జరిగిన జిల్లాస్థాయి నెట్‌బాల్ పోటీల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చింతరాచపల్లె క్రీడాకారులు అద్భుతమైన ప్రతిభ కనబరచి ఐదుగురు క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్-17 విభాగంలో బాలురు ఎం.విజయ్, బాలికల విభాగంలో బి.రమ్య, టి.సుచిత్రలు ఎంపికయ్యారు. వీరు నెల్లూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. అండర్-14లో రోహిణి, అభిలాష్‌లు ఎంపిక కావడం జరిగింది. వీరు వైజాగ్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనున్నారు. ఇటీవల ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో కడపలోని జిల్లా స్టేడియం బాస్కెట్‌బాల్ జరిగిన ఎంపికల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చింతరాచపల్లె క్రీడాకారులు అండర్-17 విభాగంలో జి.ఓబయ్య, బి.లావణ్య ఎంపిక కావడం జరిగింది. అండర్-14లో గౌతమ్ ఎంపిక కావడం జరిగింది. వీరు మదనపల్లెలో జరిగే రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని ఫిజికల్ డైరెక్టర్ పి.వెంకటసుబ్బయ్య తెలియజేశారు. ఎంపికైన క్రీడాకారులను ప్రధానోపాధ్యాయులు పి.గంగరాజు అభినందించారు.

అందరికీ కందిపప్పు !

- సరిపడా చౌక దుకాణాలకు కేటాయింపు
- గత నెల వరకూ అరాకొరా పంపిణీ
- 1వ తేది నుంచి కిలో రూ.67తో అందరికీ



కలికిరి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుదారులందరికీ శుభ వార్త. నవంబరు 1వ తేదీ నుంచి కార్డుదారులందరికీ చౌక దుకాణాల ద్వారా కందిపప్పు అందనుంది. కిలో రూ.67 వంతున ప్రతి కార్డుకు కిలో కందిపప్పును అందజేయనున్నారు. ఇలా కార్డుదారులందరికీ నెల నెలా కందిపప్పు పంపిణీ చేసిన దాఖలాలు గత ఐదేళ్లుగా లేవు. ప్రతి నెలా కేవలం 25 శాతం మాత్రమే పంపిణీ జరిగేది. ఇలా అరాకొర పంపిణీ చేయడంతో ప్రభుత్వం నుంచి అసలు కందిపప్పు సరఫరా లేదని చౌక దుకాణాల యజమానులు బుకాయించడం పరిపాటిగా జరిగేది. ప్రతి నెలా కొంత మందికి మాత్రమే పంపిణీ చేస్తుండటంతో ప్రభుత్వం నుంచి సక్రమంగా సరఫరా కావడం లేదని కార్డుదారులు కూడా సమాధాన పడేవారు. వచ్చే నెల నుంచి ఈ గందరగోళానికి తెరపడనుంది. కార్డుదారులందరికీ ఒకేసారి కందిపప్పు పంపిణీ చేయడానికి పౌర సరఫరాల శాఖ అవసరమైన నిల్వలను సిద్ధం చేసింది. చౌకదుకాణం యజమానులంతా తమకున్న కార్డుల మేరకు కందిపప్పుకు కూడా డీడీలు చెల్లించాలని పురమాయిస్తున్నారు. జిల్లాలో మొత్తం 5,04824 రేషన్ కార్డులున్నాయి. ఈ కార్డుదారులందరికీ సరిపడా 505 టన్నుల కందిపప్పును మండల స్థాయి స్టాకు పాయింట్లలో సిద్ధంగా వుంచారు. ఇక నుంచి చౌకదుకాణాల యజమానులు లేదా ఎండీయూ వాహనదార్లు అందరికీ సరిపడా కందిపప్పు సరఫరా లేదని సాకులు చెప్పే అవకాశం లేదు. ప్రతి కార్డుకూ కిలో వంతున రూ.67ల ధరతో కందిపప్పు తప్పనిసరిగా పంపిణీ చేయక తప్పదు. ఇప్పటికే డీడీలు చెల్లించిన చౌక దుకాణాలన్నింటికీ ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి అవసరమైన మేరకు కందిపప్పు స్టాకున తరలిస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో కిలో కందిపప్పు ధర రూ.170 వరకూ పలుకుతోంది. దీంతో రేషన్ కార్డుదారులంతా కూడా కందిపప్పు తీసుకోవడానికి ప్రాధాన్యత ఇస్తారని, ఎక్కడయినా కందిపప్పు సరిపడా స్టాకు రాలేదని చెపితే తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పౌర సరఫరా అధికారులు హెచ్చరిస్తున్నారు. అదే విధంగా జిల్లాలో వున్న 39,563 అంత్యోదయ కార్డులకు కార్డుకు కిలో వంతున రూ.13.50 ధరతో చక్కెర కూడా పంపిణీ చేయనున్నారు. ఇక మిగిలిన సాధారణ కార్డులకు అర కిలో వంతున రూ. 17తో అందజేయనున్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



వాల్మీకిపురంలో సీతాలక్ష్మణ సమేత పట్టాభిరాముల నగరోత్సవం



వాల్మీకిపురంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

- పురవీధులలో నగరోత్సవం

వాల్మీకిపురం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పట్టణంలో వెలసిన శ్రీపట్టాభి రామాలయంలో గురువారం టీటీడీ ఆధ్వర్యంలో పునర్వసు సీతారాముల కల్యాణోత్సవ వేడుకలను ఎంతో వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, ఆలయంలోని మూలవర్లకు అభిషేకం, అర్చన, తోమాలసేవలతో ప్రత్యేకపూజలు జరిగాయి. ఆలయంలోని మండపంలో మామిడి తోరణాలు, పుష్పలంకరణలతో కల్యాణ వేదిక సిద్ధం చేసి భోగోత్సవ మూర్తులైన సీతారామ లక్ష్మణులకు విశేష అలంకరణలు గావించారు. మంగళ వాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చరణలు, విశేష భక్తజనం నడుమ కల్యాణం కమనీయంగా సాగింది. చివరగా హోమాది కార్యక్రమాలు, పూర్ణాహుతి కార్యక్రమాలు పూర్తి చేసి వేడుకల్లో పాల్గొన్న దంపతులు, భక్తులకు టీటీడీ వస్త్రం, తీర్థప్రసాదాలను అందజేశారు. చివరగా సాయంత్రం విశేష అలంకరణలతో ముస్తాబైన ఉత్సవ మూర్తులను పురవీధులలో నగరోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజు, అర్చకులు అనిల్ స్వామి, భాషిచార్యులు, ఆలయ సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

హార్స్‌లీహిల్స్‌లో అతిథిగృహం పనుల పరిశీలన



అసంపూర్తిగా వున్న హార్స్‌లీహిల్స్‌లోని రెవెన్యూ అతిథిగృహం

బి.కొత్తకోట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పర్యాటక కేంద్రం హార్స్‌లీహిల్స్‌లోని రెవెన్యూ అతిథి గృహం పనులను పూర్తి చేసేందుకు అధికారులు అంచనాల తయారీలో నిమగ్నమయ్యారు. హిల్స్‌పై వున్న పురాతన అతిథి గృహాన్ని తొలగించి, దాని స్థానంలో అధునాతన పద్ధతిలో నూతన భవనాన్ని నిర్మిస్తున్నారు. నిర్మాణం దాదాపుగా పూర్తి కావస్తున్నప్పటికీ ఇంటీరియర్‌వర్క్, వైరింగ్, వుడ్‌వర్క్, పెయింటింగ్, శానిటరీ తదితర పనులు అసంపూర్తిగా వున్నాయి. ఈ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ శ్రీధర్ నుంచి ఆదేశాలు అందడంతో, ఆర్అండ్‌బీ ఈఈ అరవిందాదేవి, డీఈ సూర్యనారాయణలు గురువారం హార్స్‌లీహిల్స్‌కు చేరుకొని అతిథి గృహాన్ని పరిశీలించారు. పెండింగ్‌లో వున్న పనులు పూర్తి చేసి భవనాన్ని అందుబాటులోకి తేవడానికి అవసరమైన నిధులపై అంచనాలు సిద్ధం చేసి కలెక్టర్‌కు సమర్పిస్తామని వీరు పేర్కొన్నారు. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభించి పూర్తి చేస్తామన్నారు.

ఎండీయూల వ్యవస్థను రద్దు చేయాలి

- రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దివి లీలామాధవరావు



సమావేశంలో మాట్లాడుతున్న దివి లీలామాధవరావు

మదనపల్లె, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం రేషన్ డీలర్ల వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ తీసుకొచ్చిన ఎండీయూ వ్యవస్థను రద్దు చేయాలని రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దివి లీలామాధవ రావు డిమాండ్ చేశారు. స్థానిక సీఎస్ఐ కమ్యూనిటీ హాలులో గురువారం రేషన్ డీలర్ల జిల్లా స్థాయి సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ అయిదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో అన్ని వ్యవస్థలకు సమాంతరంగా మరో వ్యవస్థను తీసుకొచ్చి అన్నింటినీ కలుషితం చేసిందని ఆరోపించారు. దీంతో ఏదీ కూడా పూర్తి స్థాయిలో సక్సెస్ కాలేదని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తమ సమస్యల పట్ల సానుకూలంగా ఉన్నారని, అన్నీ త్వరలోనే పరిష్కారం అవుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. 2014-2019 మధ్య కాలంలో రేషన్ డీలర్లకు క్వింటాల్ బియ్యానికి రూ.20 నుంచి రూ.70, ఆ తర్వాత రూ.100కు పెంచిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. అలాగే రంజాన్, సంక్రాంతి, క్రిస్మస్ కానుకలను అదనంగా ఇవ్వడం ద్వారా ఏడాదికి రూ.18 కోట్లు కమీషన్ రూపంలో డీలర్లకు సమకూరినట్లు గుర్తు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో రేషన్ డీలర్లకు గౌరవ వేతనం రూ.7500, పట్టణ ప్రాంతాల్లో రూ.10 వేలు ఉన్న కమీషన్ను రూ.15 వేలు చేయాలని గతంలో చంద్రబాబు ఇచ్చిన జీవోను అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు బి.గోపాల్ రెడ్డి మాట్లాడుతూ తమ సమస్యలను రాష్ట్ర కమిటీ ద్వారా కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకుందామని పిలుపునిచ్చారు. అంతకు ముందు తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌ఛార్జి దాసరిపల్లె జయచంద్రారెడ్డి, టౌన్ బ్యాంకు మాజీ ఛైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్, ఆర్.జె.వెంకటేష్, ప్రసాద్‌రావు, మొటుకుపల్లె శివ, తదితరులు మాట్లాడారు. సమావేశంలో గుంటూరు జిల్లా కార్యదర్శి పీటీఎల్ వరప్రసాద్, ప్రకాశం జిల్లా అధ్యక్షుడు సుమన్, జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ షేక్ బాషా, మదనపల్లె పట్టణ అధ్యక్షుడు షేక్ ఇమామ్‌ఖాసీం, రూరల్ అధ్యక్షుడు కృష్ణమూర్తి, మురళి, సుధీర్‌బాబు, కళాధర్, వై.అంజనప్ప, కవిత, షేక్ ముంతాజ్‌లతో పాటు జిల్లాలోని మదనపల్లె, రాయచోటి, రాజంపేట రెవెన్యూ డివిజన్ల నుంచి పెద్ద సంఖ్యలో రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా గోపాల్‌రెడ్డి



రేషన్ డీలర్ల సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక సీఎస్ఐ ఫంక్షన్ హాలులో గురువారం జరిగిన జిల్లా స్థాయి సర్వసభ్య సమావేశంలో జిల్లా అధ్యక్షుడిగా రెండోసారి బి.గోపాల్‌రెడ్డిని, జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్‌గా షేక్ ఇమాంఖాసీం, ప్రధాన కార్యదర్శిగా షేక్ ఫరీద్‌బాషా, కోశాధికారిగా వి.సుధీర్ బాబు, రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శిగా ముంతాజ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో రామాచార్లపల్లె కృష్ణమూర్తి, జయం మురళి, సుధీర్‌బాబు, కవిత, తదితరులు పాల్గొన్నారు. అనంతరం సమావేశానికి హాజరైన కూటమి నేతలతో పాటు రాష్ట్ర అధ్యక్షుడు లీలామాధవరావును సన్మానించారు.

వర్షంతో దెబ్బతిన్న బొప్పాయి తోటలు

● రూ.కోట్లాది రూపాయల నష్టం ● లబోదిబోమంటున్న రైతాంగం ● ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

రైల్వేకోడూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు బొప్పాయి తోటలు దెబ్బతింటున్నాయి. ఎడతెరిపి లేకుండా వర్షం పడటంతో తోటల్లో నీరు నిలిచింది. వర్షం ఆగిపోయేంత వరకు చెట్లు పచ్చగానే ఉన్నాయి. సూర్యరశ్మి పడే కొద్ది చెట్లు ముడుచుకుపోయాయి. కాయలు తోటల్లోనే మాగడం, బూజు పట్టడం తదితర రకాలుగా దెబ్బతిని పనికి రాకుండా పోతున్నాయి. దీంతో కోట్లాది రూపాయల నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, పుల్లంపేట, చిట్వేలి, పెనగలూరు మండలాల్లో మామిడి, అరటి తర్వాత బొప్పాయి పంట ఎక్కువగా సాగు చేస్తారు. ఈ ఏడాది సుమారు 15వేల హెక్టార్లలో పంట సాగులో ఉంది. ఒక ఎకరాకు సుమారు రూ.50 వేలు పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. దున్న కాలు, ఎరువులు, మొక్కలు, పురుగు మందులు తదితర వాటికి రైతులకు ముందుగానే వ్యాపారులు కొంత డబ్బులు ఇస్తారు. ఈ డబ్బులను పెట్టుబడిగా పెట్టి రైతులు సాగులోకి దిగుతారు. బొప్పాయికి ప్రకృతి వైపరీత్యాలతో పాటు చీడపీడలు ఆశిస్తే మొక్కలు తట్టుకోలేవు. మొక్కలు నాటిన తర్వాత వర్షం కురిస్తే చనిపోతాయి. పెద్ద చెట్లు అయినా చనిపోతాయి. కాయలు దెబ్బతింటాయి. ఎన్ని మందులు పిచికారి చేసినా ఫలితాలు ఉండదు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది వర్షం దెబ్బకు జీవన ఎరువులు, ప్రకృతి వ్యవసాయం, జీవామృతం వంటి ప్రయోగాలు చేసిన రైతుల తోటలు కూడా ముడుచుకుపోయి కాయలు దెబ్బతిన్నాయి. చాలా మందికి పెట్టిన పెట్టుబడి కూడా రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం బొప్పాయి తోటలు దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.


ఉప్పరపల్లెలో ముడుచుకుపోయిన బొప్పాయి చెట్లు



ప్రభుత్వం ఆదుకోవాలి

రైల్వేకోడూరు మండలంలో వర్షం దెబ్బకు చాలా వరకు బొప్పాయి తోటలు తుడిచి పెట్టుకుపోయాయి. వర్షం పడినప్పుడు బాగా పచ్చగానే ఉన్నాయి. వర్షం తగ్గిన కొన్ని రోజులకు మొదట ఆకులు పూర్తిగా ముడుచుకుపోయాయి. కాయలు క్రమీణా దెబ్బతింటున్నాయి. దీంతో పెట్టిన పెట్టుబడి కూడా రాక నష్టపోతున్నాం. ప్రభుత్వం ఆదుకోవాలి.

-కోనేరెడ్డి రామసుబ్బారెడ్డి, ఉప్పరపల్లె, రైల్వేకోడూరు



ప్రతి ఏడాది నష్టపోతున్నాం.

ప్రతి ఏడాది ప్రకృతి వైపరిత్యాలతో బొప్పాయి పంట దెబ్బతిని నష్టపోతున్నాం. ఈ ఏడాది ఎడతెరిపి లేని వర్షం కారణంగా తోటలు దెబ్బతిని నష్టపోతున్నాం. కాయకష్టం చేసినా లాభాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. సాగులో ఎక్కడ రాజీ లేకుండా చేసినా నాసిరకం విత్తనాలతో నష్టపోతున్నాం.

-గుండాల దామోదర్‌రెడ్డి, ఉప్పరపల్లె, రైల్వేకోడూరు

జాతీయ ఉర్దూ సెమినార్‌కు ప్యాట్రన్‌గా అమీర్‌బాబు


అమీర్‌బాబు, సత్తార్‌ఫైజి

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అంజుమన్ తరక్కీ ఉర్దూ జిల్లాశాఖ ఆధ్వర్యంలో నవంబరు 9, 10 తేదీల్లో కడప ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జరగనున్న జాతీయ ఉర్దూ సెమినార్‌కు ప్యాట్రన్‌గా వీఎస్ అమీర్‌బాబు, చైర్మన్‌గా సత్తార్‌ఫైజీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంస్థ ప్రధానకార్యదర్శ సయ్యద్ హిదయతుల్లా తెలిపారు. వీరి ఎంపిక పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఆరు సంవత్సరాల తరువాత కడపలో మళ్లీ జాతీయ స్థాయిలో ఉర్దూ సెమినార్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఉర్దూ విద్య, సాహిత్య, సారస్కృతిక సమస్యలు పరిష్కారం మన బాధ్యత అన్న అంశంపై దాదాపు 24 మంది పరిశోధకులు తమ పత్రాలు సమర్పించనున్నారు. ఏపీ, తెలంగాణ, కేరళ, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి ప్రముఖ ఉర్దూ సాహితీవేత్తలకు కవులు, రచయితలు సాహితీ విమర్శకులు పాల్గొంటారన్నారు. ఈ రెండురోజుల కార్యక్రమాలు సెమినార్ ప్రారంభోత్సవం, ఉర్దూ సావనీర్ ఆవిష్కరణ, జాతీయ స్థాయిలో కవి సమ్మేళనం వ్యక్తృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందిస్తారని తెలిపారు.

జేఎన్టీయూలో ప్రారంభమైన యంత్ర-2కె24


యంత్ర-2కె24 జాతీయ సదస్సు బుక్‌లెట్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

పులివెందుల రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : స్థానిక జేఎన్టీయూ కళాశాలలో యంత్ర-2కె24 జాతీయ సదస్సు గురువారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ హెడ్ మెకానికల్ టి.చంద్రశేఖర్‌రెడ్డి హాజరై బుక్‌లెట్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి ఎఫ్3 కార్ డిజైన్ మరియు రోబొటిక్స్ పాత్ర ప్రాముఖ్యతను వివరించారు. అలాగే ఈ సదస్సులో హైస్పీడ్ ఎలక్ట్రికల్ వెహికల్ (ఎఫ్3 కార్ మోడల్) మరియు ఐఓటీ విత్ హ్యూమనాయిడ్ రొబొటిక్స్‌పై విద్యార్థులకు మూడు రోజజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ అరుణకాంతి, వైస్ ప్రిన్సిపల్ సుబ్బారెడ్డి, మెకానికల్ విభాగాధిపతి ప్రొఫెసర్ వేణుగోపాల్‌రెడ్డి, దేశం నలుమూలల నుంచి దాదాపు 500 మంది విద్యార్థులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

14 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

● ముగ్గురు స్మగ్లర్లు అరెస్ట్ ● కడప డీఎఫ్ఓ వినీత్‌కుమార్


పట్టుబడిన స్మగ్లర్లు, దుంగలతో డీఎఫ్ఓ వినీత్‌కుమార్, అటవీశాఖ అధికారులు

సిద్దవటం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సిద్దవటం రేంజి గొల్లపల్లె బీట్‌లోని అనుమానాస్పద ప్రాంతాల్లో కూంబింగ్ నిర్వహించి 14 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని ముగ్గురు స్మగ్లర్లను అరెస్ట్ చేసినట్లు డీఎఫ్‌వో వినీత్ కుమార్ తెలిపారు. సిద్దవటం అటవీశాఖ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ గొల్లపల్లె బీట్‌లోని అనుమానాస్పద ప్రాంతమైన సాలుపెంట ప్రదేశంలో అటవీశాఖ సిబ్బంది కూంబింగ్ నిర్వహిస్తుండగా స్మగ్లర్లు 14 ఎర్రచందనం దుంగలు మోసుకుని వెళుతుండగా దాడులు నిర్వహించి చాపాడు మండలానికి చెందిన హబీబుల్లా, తమిళనాడుకు చెందిన గోపీ, తీర్థగిరిలను అరెస్ట్ చేశారన్నారు. చాపాడు మండలానికి చెందిన జాకీర్ అనేవ్యక్తి పరారయ్యాడు. పట్టుబడిన స్మగ్లర్ల వద్ద నుంచి 14 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని అటవీశాఖ కార్యాలయానికి తరలించారన్నారు. పట్టుబడిన దుంగల విలువ సుమారు 1,06,686 రూపాయలు విలువ చేస్తాయన్నారు. ప్రపంచంలోనే అత్యంత విలువైన ఎర్రచదనం ఇతర రాష్ట్రాలకు వెళ్లకుండా కార్యక్రమంలో సబ్‌డీఎఫ్‌వో స్వామివివేకానంద, రేంజర్ కళావతి, డిప్యూటీ రేంజర్ ఓబులేశు, సెక్షన్ అధికారి సురేష్‌బాబు, ఫారెస్ట్ బీట్ అధికారులు మధు, విశ్వనాథ్, పెంచల్‌రెడ్డి, అసిస్టెంట్‌బీట్ అధికారులు హైమావతి, ప్రొటక్షన్ వాచర్‌లు, స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల భూసమస్యల పరిష్కారానికి కృషి

● ఇన్‌ఛార్జ్ కలెక్టర్ అతిథిసింగ్


రైతులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ అతిథిసింగ్

బ్రహ్మంగారిమఠం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో రీసర్వేలో రైతన్నలకు పూర్తిస్థాయిలో నష్టం వాటిల్లింది. ఈనేపద్యంలో ప్రభుత్వం ప్రతి పంచాయతీలో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోంది. గురువారం బ్రహ్మంగారిమఠం మండలంలోని ముడుమాల, మల్లేపల్లె గ్రామ పంచాయతీల్లో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. బద్వేలు డివిజను ఆర్డీవో చంద్ర మోహన్, బి.మఠం తహసీల్దారు దామోదర్‌రెడ్డి పర్యవేక్షణలో చేపట్టిన ఈ సదస్సులకు జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ అతిథిసింగ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతన్నలతో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రీసర్వేలో భూములు కోల్పోయినట్లు తమ దృష్టికి తెస్తే జిల్లా స్థాయి అధికారులతో కమిటీ వేసి గ్రామస్థాయిలో సర్వేలు నిర్వహించి పరిష్కరిస్తామన్నారు. అలాగే గ్రీన్ ఫీల్డ్ హైవే రోడ్ల విస్తరణ పనుల్లో భూములు కోల్పోయిన రైత న్నలకు సత్వరమే నష్టపరిహారం అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు చెన్నుపల్లె సుబ్బారెడ్డి ముడుమాల, మల్లేపల్లె గ్రామ పంచా యతీల్లో భూ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని.. రీసర్వేలో కొందరు రైతులు తమ భూములు కోల్పోయారని తెలిపారు. అలాగే జాతీయ రహదారి పనులు విస్తరణలో భూములు కోల్పోయిన కొంతమందికి మాత్రమే నష్టపరిహారం వచ్చిందని.. మిగిలిన వారికి వెంటనే నష్టపరిహారం అందించాలని ఇన్‌ఛార్జ్ కలెక్టరును కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు జాన్సన్, హైవే రోడ్డు అధికారులు, మాజీ ఎంపీటీసీ రమేశ్, చిలమల నారాయణ, చిలమల నాగయ్య, మస్తాన్, శ్రీను, ముడుమాల పోలిరెడ్డి, సురేంద్రయాదవ్, మేకల సుధాకర్, వెల్లటూరు సాంబశివారెడ్డి, వీరయ్య, సిద్దయ్య పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలి



మాట్లాడుతున్న యువజన సర్వీసుల శాఖ కమిషనర్ శారదాదేవి

కడప నాగరాజుపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మంచి అలవాట్లతో ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని విజయవాడ యువజన సర్వీసుల శాఖ కమిషనర్ శారదాదేవి అన్నారు. జిల్లాలో ఆ శాఖ పర్యటనలో భాగంగా గురువారం కడప నగరంలోని వివేకానంద మహిళా డిగ్రీకళాశాలలో వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యక్తిత్వ వికాసం అంటే ప్రతి ఒక్కరూ మంచి అలవాట్లతో ఆరోగ్యం పరిరక్షించుకోవాలని, వారి మనసు చదువు, కళలు, క్రీడలు పట్ల ఏకాగ్రత కలిగి మంచి ఉన్నత స్థితికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం స్టేట్ గెస్ట్‌హౌస్ లో యువజన సంఘ సభ్యులు, స్వచ్ఛంద సేవా సంస్థలతో యువజన సంఘాల బలోపేతానికి తమ వంతు కృషి చేయాలని కోరారు. స్టెప్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి సాయిగ్రేస్ మాట్లాడుతూ దేశ జనాభాలో యువత 33 శాతం ఉన్నదని, ప్రపంచంలో ఏ ఇతర దేశంలో యువత ఇంత శాతం లేదన్నారు. కళాశాల కరస్పాండెంట్ మనోహర్‌రెడ్డి, ప్రిన్సిపల్ నాగమణి, స్టెప్ మేనేజరు వీవీ సుబ్బరాయుడు, సిబ్బంది అబ్బాస్‌ఆలీ, నాగయ్య, వీవీ నారాయణ పాల్గొన్నారు.

రాఘవరాజపురంలో చోరీ

30 గ్రాముల బంగారం, రూ. 38 వేల నగదు అపహరించిన దొంగలు

రైల్వేకోడూరు, అక్టోబరు 24:(ఆంధ్రజ్యోతి) మండలంలోని రాఘవరాజపురం గ్రామానికి చెందిన ఈదర పార్థసారథి ఇంటిలో చోరీకి పాల్పడి 30 గ్రాముల బంగారు నగలు, రూ.38 వేల నగదు చోరీ చేశారు. బాధితుడి వివరాల మేరకు.. పార్థసారధి తన కుటుంబ సభ్యులతో కలసి కమలాపురానికి బుధవారం వెళారు. రాత్రి 10 గంటల సమయంలో ఇంటికి వచ్చే సరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉండడం గమనించి... ఇంటిలోకి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న రెండు బంగారు చైన్లు, రెండు చిన్న ఉంగరాలు, ఒక గొలుసు, కమ్మలు, రూ.38వేలు నగదు గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ మేరకు గురువారం రైల్వేకోడూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

స్వర్ణాంధ్ర సాధనకు ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలి

● అన్నమయ్య జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి(కలెక్టరేట్), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లాకు సంబంధించి స్వర్ణాంధ్ర-2047లోని లక్ష్యాలను సాధించేందుకు అధికారులందరూ కార్యాచరణ ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశించారు. గురువారం సాయంత్రం వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్‌ప్రసాద్, స్వర్ణాంధ్ర-2047పై సమీక్ష సమావేశం నిర్వహించారు. రాయచోటి కలెక్టరేట్ నుంచి కలెక్టర్ చామకూరి శ్రీధర్, జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్ ఈ సమీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్రంలోని 26 జిల్లాలు, 686 మండలాల నుంచి స్వర్ణాంధ్ర-2047పై విజన్‌పత్రాలు అందాయని తెలుపుతూ సంతోషం వ్యక్తం చేశారు. విజన్ పత్రాలను రూపొందించిన అనంతరం జిల్లాలు, మండలాల పనితీరుపై సూచికలను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రధానమంత్రి చేతుల మీదుగా ముఖ్యమంత్రి, ఉప మంత్రివర్యుల సమక్షంలో త్వరలో స్వర్ణాంధ్ర-2047కు సంబంధించిన పూర్తి నివేదికను ప్రజలందరికీ అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ చామకూరి శ్రీధర్, అన్న మయ్య జిల్లాకు సంబంధించిన స్వర్ణాంధ్ర-2047 గురించి మాట్లా డుతూ జిల్లాలో పర్యాటకం, ఫుడ్ ప్రాసెసింగ్, నైపుణ్య అభివృద్ధి తదితర రంగాల్లో మంచి అవకాశాలు ఉన్నాయని.. వీటిని పూర్తి స్థాయిలో వినియోగించుకుంటామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి తెలిపారు. అనంతరం కలెక్టర్ జిల్లా అధికారుల నుద్దేశించి మాట్లాడుతూ స్వర్ణాంధ్ర-2047లో మన జిల్లాకు సంబంధించి నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుని పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలని ఆదేశించారు. డీఆర్‌వో సత్యనారాయణరావు, సీపీవో వెంకట్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఏపీ పర్యావరణ ప్రభావ మదింపు ప్రాధికారిక సంస్థ సభ్యుడిగా డాక్టర్ చంద్రశేఖర్



కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలోని పర్యావరణ ప్రభావ మదింపు ప్రాధికార సంస్థ సభ్యుడిగా వైవీయూ పర్యావరణ శాఖ సహాయాచార్యులు చంద్రశేఖర్ నియమితులయ్యారు. ఈమేరకు సెంట్రల్ గవర్నమెంటు ఎన్విరాన్‌మెంటు ఫారెస్టు అండ్ క్లైమెట్ ఛేంజ్ అడిషనల్ సెక్రటరీ డాక్టర్ అమన్‌దీప్‌గార్గ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీలో చైర్మన్‌తో పాటు మెంబరు సెక్రటరీ సభ్యులు కలిసి రాష్ట్రంలో పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



కమలాపురం రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కమలాపురం మండల పరిధిలోని కడప - తాడిపత్రి ప్రధాన రహదారిపై పందిళ్లపల్లె వద్ద శ్రీభైరవేశ్వర ఆలయ సమీపంలో గురువారం ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ద్విచక్ర వాహనదారునికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు పోలీసుల సహకారంతో స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కడప రిమ్స్‌కు తరలించారు. క్షతగాత్రుడు మొలకవారిపల్లెకు చెందిన చింతకుంట రవిశంకర్‌రెడ్డి (50)గా పోలీసులు గుర్తించారు. 108 ద్వారా కడప రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడు ఓ సిమెంటు కంపెనీలో ప్రొక్లైనర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నట్లు సమాచారం.

ఉద్యోగుల సందేహాల నివృత్తికే పెన్షన్, జీపీఎఫ్ అదాలత్

● ప్రిన్సిపల్ అకౌంట్ జనరల్ చంద్రమౌళిసింగ్


ఉద్యోగులకు జీపీఎఫ్ పత్రాలను అందజేస్తున్న చంద్రమౌళి సింగ్

కడప కలెక్టరేట్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల పెన్షన్, జీపీఎఫ్‌లకు సంబంధించి వివిధ సందేహాలను నివృత్తి చేసేందుకే పెన్షన్, జీపీఎఫ్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ చంద్రమౌళి సింగ్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని సభాభవనంలో అకౌంటెంట్ జనరల్ డైరెక్టరేట్ ఆఫ్ ట్రెజరీస్ మరియు అకౌంట్స్‌శాఖల ఆధ్వర్యంలో జిల్లా పరిధిలోని ఉద్యోగుల జీపీఎఫ్, పెన్షన్ సమస్యలపై అదాలత్ కార్యక్రమం జరిగింది. ఈకార్యక్రమానికి డైరెక్టరేట్ ఆఫ్ ఆడిటర్ జనరల్ లలిత్ కుమార్, ట్రెజరీశాఖ డైరెక్టర్ మోహన్‌రావుల పాల్గొన్నార. ఈసందర్భంగా ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ చంద్రమౌళిసింగ్ మాట్లాడుతూ ప్రతి ఒక్క ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ అయిన మరుసటి రోజునే పెన్షన్ మంజూరు చేయాలన్నదే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. అందుకు సంబంధించి ప్రతి ఉద్యోగి ఆరు నెలల లోపు పెన్షన్‌కి సంబంధించిన అన్ని డాక్యుమెంట్లను ఆశాఖల డీడీలకు పంపాలన్నారు పదవీ విరమణ సమయానికి సర్వీస్ రిజిస్టర్ అప్డేట్ ఉండేలా చూసుకోవడం ఉద్యోగుల బాధ్యత అన్నారు. రిసర్వీసు రిజిస్టర్‌లో అన్ని ఎంట్రీలు కరెక్ట్‌గా ఉండేలా సరిచూసుకోవాలన్నారు. ఎటువంటి లోన్ పెండింగ్ కేసులు ఉండకూడదన్నారు పెన్షన్ డాక్యుమెంట్ అందిన వెంటనే ఏజీ నియమ నిబంధనల ప్రకారం వేగవంతంగా పెన్షన్ మంజూరుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మా నోటీసుకు రాని జీపీఎఫ్, పెన్షన్ సమస్యలు ఇంకా ఏమైనా ఉంటే అదాలత్ దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలన్నారు. ఈ సదస్సు అనంతరం జిల్లా వ్యాప్తంగా పదవీ విరమణ పొందిన పలువురు ఉద్యోగులకు, పెన్షన్ పేమెంట్ ఆర్డర్‌లను అందజేశారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగులకు జీపీఎఫ్ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ అకౌంటెంట్ ఆఫీసర్లు సునీత, చంద్రశేఖర్, భవానీప్రసాద్, విజయ్‌కుమార్, జిల్లా ట్రెజరీశాఖ డీడీ వెంకటేశ్వర్లు, సబ్‌ట్రెజరీ అధికారులు పాల్గొన్నారు.

గండికోట నుంచి 6వేల క్యూసెక్కులు విడుదల

కొండాపురం/మైలవరం అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరానికి గురువారం 6000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తునట్లు డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. కాగా ప్రాజెక్టులోకి జీఎన్ఎస్ఎస్ కాలువ ద్వారా 5,500 క్యూసెక్కుల కృష్ణాజలాలు, వరద నీరు మరో 500 క్యూసెక్కులు దాకా వచ్చి చేరుతున్నట్లు తెలిపారు. అదేవిధంగా మెయిన్‌కెనాల్‌కు 75 క్యూసెక్కుల నీటిని వదులుతున్నామన్నారు.

పెన్నానదికి కొనసాగుతున్న నీటి విడుదల

మైలవరం జలాశయం నుంచి పెన్నానదికి 6 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు డీఈఈ నరసింహమూర్తి తెలిపారు. మైలవరం ఉత్తర కాలువకు 25 క్యూసెక్కులు, దక్షిణ కాలువకు 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. గండికోట నుంచి మైలవరానికి ఇన్‌ఫ్లో పెరిగితే మరింత నీటిని పెన్నానదికి విడుదల చేయడం జరుగుతుందని డీఈఈ తెలిపారు.

చంద్రబాబును కలిసిన గోవర్ధనరెడ్డి, హరిప్రసాద్



కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబును టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు గోవర్ధనరెడ్డి, హరిప్రసాద్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా రాజకీయాలపై చర్చించారు. అలాగే కార్యకర్తలకు అండగా ఉండాలని చంద్రబాబు సూచించినట్లు తెలిపారు.

గత వైసీపీ ప్రభుత్వం నిర్వాకంతోనే యువత డ్రగ్స్ వైపు

● కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి, పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి


డ్రగ్స్ కట్టడికి చర్యలు తీసుకోవాలని ఆవేదన వ్యక్తం చేస్తున్న మహిళ

కడప క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలో కొంత మంది యువకులు గంజాయితో పాటు డ్రగ్స్‌కు అలవాటు పడి జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని.. ఈ దుస్థితి గత వైసీపీ ప్రభుత్వం నిర్వాకంతోనే నెలకొందని కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి, పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి మండిపడ్డారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం వారు మత్తుకు అలవాటు పడ్డ యువకుల తల్లులతో కలిసి ఎస్పీ హర్షవర్ధన్‌రాజుకు ఫిర్యాదు చేశారు. యువకులు మత్తుకు సంబంధించిన ట్యాబ్లెట్లను ఇంజక్షన్ రూపంలో వినియోగించుకుంటున్నారని.. వీటిపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని ఎస్పీకి విజ్ఞప్తి చేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా ట్యాబ్లెట్లు విక్రయిస్తున్నారని రూ.300 విలువ చేసే ట్యాబ్లెట్లు వెయ్యి రూపాయలకు విక్రయిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. నగరంలో గంజాయి డ్రగ్స్ విచ్చలవిడిగా దొరుకుతోందని.. వీటిని వాడిన యువకులతో పాటు మైనరు పిల్లల జీవితాలు నాశనం అవుతున్నాయన్నారు. మత్తుకు బానిసైన యువకుల కుటుంబ సభ్యులు తమ దృష్టికి తీసుకురావడంతో ఎస్పీకి ఫిర్యాదు చేశామని.. ఆయన సానుకూలంగా స్పందించి వాటి నిర్మూలనకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారన్నారు.

మా పిల్లలను రక్షించండి

మా బిడ్డలు మత్తు పదార్థాలకు అలవాటు పడి.. ఆ మత్తులో ఇంట్లో డబ్బులు ఇవ్వాలంటూ నసపెడుతున్నారని.. ఇవ్వలేదంటే కొడుతున్నారని మత్తుకు అలవాటు పడ్డ యువకుల తల్లులు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే పోలీసు అధికారులు చర్యలు తీసుకుని డ్రగ్స్ కట్టడికి చర్యలు తీసుకోవాలని కోరారు.

టమోటా వైపు.. రైతన్న చూపు

- సాగు ఖర్చైనా ముందుకెళ్తున్న వైనం
- వేరుశనగ పంటతో దెబ్బతిన్న రైతన్న టమోటా సాగుకు నడుంబిగించారు


కలిచెర్ల సమీపంలో ప్రారంభ దశలో ఉన్న టమోటా పంట తోట


పూత దశలో మందులు పిచికారి చేస్తున్న రైతులు

పెద్దమండ్యం, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి):పంట సాటులో ఎన్ని ఇబ్బందులు ఎదురవుతున్న రైతులు టమోట పంట సాగుకు అడుగులు వేస్తూనే ఉన్నారు. గతంలో ఎన్నడు లేని విధంగా టమోట పంట సాగు విస్తారంగా పెరిగింది. కారణం ఆశించిన స్థాయిలో టమోట ధరలు పెరగడమే. ఖరీఫ్‌లో వేరుశనగ పంట వర్షాభావ పరిస్థితులతో ఆశించిన స్థాయిలో దిగుబడులు లేక రైతులు నష్టాలు చవిచూశారు. దీంతో ఈ ప్రాంత రైతులు వ్యవసాయబోర్ల కింద టమోటా సాగుకు మొగ్గు చూపుతున్నారు. అలాగే గతంలో టమోటా సాగు చేసిన రైతులు ఆర్థికంగా నష్ట పోయారు. గత రెండు నెలలుగా 30 కిలోల బాక్స్ టమోట కాయలు నాణ్యత బట్టి రూ. 300 నుంచి రూ. 1500 వరకు ధర పలుకుతోందని రైతులు తెలిపారు. ఇటీవల 15 కిలోల కిరిట్ 5వందల నుంచి 7వందల వరకు ధర పలుకుతోంది. అన్నమయ్య, చిత్తూరు జిల్లాలలో తదితర ప్రాంతాలలో సుమారు 35 వేల ఎకరాల్లో టమోట పంట సాగులో ఉందని అధికారులు తెలిపారు. వ్యవసాయ బోరు వున్న ప్రతి రైతు అధికంగా టమోటీ పంట సాగుకు మొగ్గు చూపుతున్నారు. ఒక ఎకరానికి టమోట పంట సాగు చేయాలంటే రైతుకు రూ. 1.30 లక్షల నుంచి 2 లక్షలు పెట్టుబడి ఖర్చవుతుందన్నారు. భూమి సేద్యంతో పాటు కవర్, ఎరువులు, పిచికారి మందులు అధిక పెట్టుబడి పెట్టాల్సి ఉందన్నారు. అయినా టమోటా సాగుకు పలువురు రైతులు వెనకంజ వేయడం లేదు. ఎకరానికి టమోట ఒక కోతకు 30 కిలోల బాక్స్‌లు 80 నుంచి 100 బాక్స్‌లు వస్తున్నాయి. ఇతర ప్రాంతాల రైతులు కూడా భూమి లీజు తీసుకొని టమోటా పంట సాగు చేస్తున్నారు. ఈ ఏడాదిలో ప్రస్తుతం సాగులో ఉన్న టమోట పంటకు మాత్రమే ఆశించిన స్థాయిలో గిట్టుబాటు ధరలు వచ్చాయి. రెండు నెలలుగా టమోట ధరలు ఆశించిన స్థాయిలో నిలకడగా ఉన్నాయని రైతులు తెలిపారు. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షానికి కొంత టమోట ధరలు తగ్గుముఖం పట్టాయి. కారణం టమోటా ఎగుమతులు లేకపోవడమే. కానీ ఈ ప్రాంతంలో అతి భారీ వర్షాలు లేకపోవడంతో టమోటా రైతు ఊపిరి పీల్చుకున్నారు. పంట 10 రోజులు తెగుళ్లు సోకే అవకాశం ఉందని మందులు సకాలంలో పిచికారి చేయాలని హర్టికల్చరర్ అధికారులు సూచిస్తున్నారు. పంట దిగుబడి, ధరలు తగ్గితే పంట నష్టాల పాలు చేస్తుంది. ఇటీవలె ఎగువ రాష్ట్రాలలో భారీ వర్షాలు తగ్గితే ఇక్కడ మళ్లీ టమోటకు ధరలు భారీగా పలుకుతున్నాయని రైతులు తెలిపారు. ప్రస్తుతం ధరలు కొనసాగితే రైతుకు గిట్టుబాటు అవుతోందన్నారు. ప్రస్తుతం టమోట పంట తోటలను రైతులు పోటీపడి సాగు చేస్తున్నట్లు తెలిపారు. కరువు రైతులకు ఈ పంట ఊరట నిచ్చింది. ఈ వర్షాలతో జిల్లాలో భూగర్భ జలాలు పెరిగి టమోట సాగు మరింత పెరుగుతున్నది.

లాభ నష్టాలు చూడాల్సిందే...

టమోటా పంట సాగు చేసే ప్రతి రైతు లాభ నష్టాలు చవి చూడాల్సిందే. కానీ ఈ పంట జూదం లాంటిది. టమోటా పంట సాగు సాహసంతో కూడుకున్నది. ఎకరానికి రూ. 2 లక్షలు పెట్టుబడి పెట్టాలి. పంట లాభం వస్తే పర్వాలేదు. కానీ నష్టం వస్తే ఆర్థికంగా ఇబ్బందులు తప్పవు. ప్రస్తుతం టమోట కు ఆశించిన స్థాయిలో ధరలు పలుకుతున్నాయి.

- సోమశేఖర్. రైతు. పెద్దమండ్యం

'గోపాలకృష్ణపై దాడికి పాల్పడిన వారిని వదిలిపెట్టం'

తంబళ్లపల్లె అక్టోబర్ 24 (ఆంధ్రజ్యోతి) : తంబళ్లపల్లె మండలం కన్నెమడుగు పంచాయతీ కే. రామిగానిపల్లెకు చెందిన గోపాలకృష్ణపై దాడిచేసిన వైసీపీ నాయకులను వదిలిపెట్టే ప్రసక్తే లేదని జిల్లా టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్మోహన్ రాజు హెచ్చరించారు. గురువారం ఆయన తంబళ్లపల్లె నియోజకవర్గం టీడీపీ నేత దాసరిపల్లె జయచంద్రారెడ్డి, సమన్వయ కర్త సీడ్ మల్లిఖార్జున నాయుడులతో కలసి తంబళ్లపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గోపాలకృష్ణను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చి కొంత ఆర్థిక సహాయం అందించారు. కాగా గత మూడు రోజుల క్రితం స్థల వివాదంలో వైసీపీ నాయకులు గోపాలకృష్ణపై మారణాయుధాలతో దాడి చేసి తలకు తీవ్రంగా గాయపర్చారు. ఈ విషయమై స్థానిక పోలీసులు స్పందించలేదని టీడీపీ నాయకులు, కార్యకర్తలు జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్ రాజు, జయచంద్రారెడ్డి, మల్లిఖార్జుననాయుడులకు పిర్యాదు చేశారు. వారి వెంట టీడీపీ నాయకులు రెడ్డెప్పరెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు రామచంద్ర, ఉత్తమరెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ బేరి శ్రీనివాసులు, సోమశేఖర్, తెలుగు యువత నరసింహులు, సామిరెడ్డి, ధనశేఖర్, నాగేంద్ర నాయుడు, రామలింగారెడ్డి, సుధాకర్‌రెడ్డి, రేపన బాబు, రామచంద్రారెడ్డి, ఆనంద్,నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రెవెన్యూ మంత్రిని కలిసిన ఎమ్మార్పీఎస్ నేత


రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కలిసిన ఎమ్మార్పీఎస్ నేత నరేంద్రబాబు

మదనపల్లె అర్బన్, అక్టోబరు24:(ఆంధ్రజ్యోతి) రెవెన్యూ శాఖామంత్రి అనగాని సత్యప్రసాద్‌ను గురువారం ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు నరేంద్రబాబు రాష్ట్ర సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలసి దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి సొంత నియోజకవర్గమైన రేపల్లెలో ఎమ్మార్పీఎస్ కార్యకర్తల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కూటమి గెలుపు కీలక పాత్ర వహించిన ఎమ్మార్పీస్ అధినేత మందకృష్ణమాదిగ నాయకత్వంలో ఎమ్మార్పీఎస్ కారకర్తల కృషిని కొనియాడారు. నియోజకవర్గానికి చెందిన ఎంఎస్‌పీ, ఎమ్మార్పీఎస్, ఏఈఎఫ్, ఎంఎల్ఎఫ్ నాయకులు మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

సర్వే సమస్యలను సత్వరమే పరిష్కరించండి


మండల సర్వేయర్లకు సూచనలిస్తున్న డీఎస్ఎల్‌వో భరత్‌కుమార్

మదనపల్లె, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రైతులు, ప్రజల నుంచి సర్వే పరంగా వచ్చే అర్జీలను సత్వరం పరిష్కరించాలని డిస్ట్రిక్ సర్వే ల్యాండ్ రికార్డు ఆఫీసర్ (డీఎస్ఎల్‌వో) బి.భరత్‌కుమార్ మండల సర్వేయర్లను ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం సాయంత్రం డివిజన్‌లోని 11 మండలాల సర్వేయర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా డీఎస్ఎల్‌వో మాట్లాడుతూ పబ్లిక్ గ్రీవెన్స్ రీఅడ్రసల్ సర్వీసెస్(పీజీఆర్ఎస్) వచ్చే అర్జీలను ఎప్పటికప్పుడు త్వరితగతిన, సక్రమమైన మార్గంలో పరిష్కరించాలన్నారు. ముఖ్యంగా సర్వేహద్దుల గుర్తింపు కోసం వచ్చే రైతులను పదేపదే తిప్పుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటికే తహసీల్దార్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న అర్జీలను ఈనెలాఖరులోగా పూర్తి చేసి సచివాలయం, మండలాల వారీగా నివేదిక ఇవ్వాలని మండల, గ్రామ సర్వేయర్లకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్లు బీకేవెంకటరమణనాయుడు, కె.రవిచంద్ర, కలికిరి సర్వేయర్ రెడ్డెప్ప, తదితరులు పాల్గొన్నారు.

పది రూపాయల నాణేలపై అపోహలొద్దు...


వివరాలువెల్లడిస్తున్న ఇండియన్ బ్యాంకు మేనేజర్

తంబళ్లపల్లె అక్టోబర్ 24 (ఆంధ్రజ్యోతి) : పదిరూపాయల నాణేలపై ఎటు వంటి అపోహలు వద్దని అవి చట్టబద్ధమైన వేనని ప్రతి ఒక్కరూ 10 రూ పాయల నాణేలను లావాదేవీలలో ఉపయోగించాలని తంబళ్లపల్లె ఇండి యన్ బ్యాంకు మేనేజర్ హరనాథగుప్త తెలిపారు. గురువారం ఆయన పది రూపాయల నాణేం చలామణిపై అవగాహన కల్పించారు. జనసం చార కూడళ్లలో దుకాణాల వద్ద పదిరూపాయల నాణేల చలామణిపై ముద్రించిన స్టిక్కర్లను అంటించారు. రిజర్వ్ బ్యాంకు ఆదేశాల మేరకు పది రూపాయల నాణేలను ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని ఆయన సూచించారు. దీనిపై ఎలాంటి అపోహలు పడాల్సిన అవసరం లేదని తెలిపారు.





ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి

కలకడ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాడి రైతులకు అమలు పరుస్తున్న పథకాలను అర్హులు సద్విని యోగం చేసుకోవాలని పశుసంవర్థక శాఖ జేడీ గుణశేఖర్‌పిళ్ళై తెలిపారు. గురువారం ఆయన మండలంలోని గోపాలపురంలో జరుగుతున్న సామూహిక నట్టల నివారణ కార్యక్రమాన్ని తనిఖీ చేసి గొర్రెలకు మందు తాగించారు. ఈ సందర్భంగా ఈ నెల 25వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పశుగణనపై సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏడీ క్రిష్ణయ్య, డాక్టర్లు తేజ్‌కళ్యాణ్, పూర్ణిమ పాల్గొన్నారు

మదనపల్లె డీవైఈవోగా కేవీఎన్ కుమార్

మదనపల్లె అర్బన్, అక్టోబరు24: మదనపల్లె ఉపవిద్యాశాఖాధికారిగా ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అడిషనల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న కేవీఎన్ కుమార్ నియమితులయ్యారు. మదనపల్లె డీవైఈవో పని చేస్తున్న శ్రీరామపురుషోత్తంను ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అడిషనల్ డైరెక్టర్‌గా నియమిస్తూ బాపట్ల డీఈవోగా నియమించారు. గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసినట్లు చెప్పారు.

క్రీడాపోటీల్లో విద్యార్థుల ప్రతిభ

మదనపల్లె టౌన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ ఆధ్వర్యంలో తిరుపతిలో నిర్వహించిన అంతర్ యూనివర్సిటీ క్రీడా పోటీల్లో స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారని కరస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్ పేర్కొన్నారు. హాకీ, షటిల్ బాడ్మింటన్ పోటీల్లో ఫైనల్స్‌కు చేరిన తమ కళాశాల విద్యార్థులు రెండు పోటీల్లోను రన్నర్స్‌గా నిలిచారన్నారు. ఎస్వీయూ వీసీ అప్పారావు రన్నర్స్‌గా నిలిచిన జట్లకు సర్టిఫికెట్లతో పాటు షీల్డులు కూడా అందించారన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రిన్సిపాల్ రమాదేవి, పీడీ శరత్‌నాయక్ అభినందించారు

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థులు ఎంపిక

కలకడ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర అథ్లెటిక్స్ పోటీలకు కలకడ గురుకుల పాఠశాల బాలికలు నుంచి ముగ్గురు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సుమిత్ర తెలిపారు. చిత్తూరులోని డీఎస్ఏ స్టేడియంలో జరిగిన అండర్-17 జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొని 3కిలో మీటర్ల రేస్‌వాక్ విభాగంగా యాస్మిత, 3కిలో మీటర్ రన్‌లో సంగీత, 400 హార్డిల్స్‌లో హరిత సత్తాచాటినట్లు తెలిపారు. వారు వచ్చే నెల 3,4 తేదిలో శ్రీకాకుళంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

మొక్కలు నాటి సంరక్షిద్దాం

మదనపల్లె టౌన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు వారి అమ్మపేరుతో ఒక మొక్కను నాటి సంరక్షించాలని యూత్ కరాటే, స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏఆర్ సురేష్ పిలుపునిచ్చారు. గురువారం నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో పట్టణంలోని పలుచోట్ల మొక్కలు నాటారు. బీసీ హాస్టల్ వార్డెన్ వెంకటేశ్ మాట్లాడుతూ విద్యార్థులు మొక్కలను నాటడంతో పాటు వాటిని పెంచి పోషించడాన్ని బాధ్యతగా తీసుకోవాలన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదును ఉద్యమంలా చేపట్టాలి

- తంబళ్లపల్లెను ప్రథమ స్థానంలో నిలపాలి
- జయచంద్రారెడ్డికి జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు సూచన


సభ్యత్వ నమోదుపై సూచనలిస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు, జయచంద్రారెడ్డి

ములకలచెరువు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి):టీడీపీ సభ్యత్వ నమోదును ఉద్యమంగా చేపట్టాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు సూచించారు. ములకలచెరువులో గురువారం ఆయన తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డితో సభ్యత్వ నమోదు కార్యక్రమంపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 26వతేదీ నుంచి ప్రారంభం కానున్న టీడీపీ సభ్యత్వ నమోదులో తంబళ్లపల్లె నియోజకవర్గాన్ని జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలపాలన్నారు. సభ్యత్వ నమోదును పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గ ప్రచార సమన్వయకర్త సీడు మల్లికార్జుననాయుడు, టీడీపీ నేత మంత్రి గిరిధర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేవీ రమణ, నాయకులు విశ్వనాధరెడ్డి, భజంత్రి రామాంజులు, బత్తుల శ్రీనివాసులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన భోజనం అందించాలి


వాల్మీకిపురంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తనిఖీ చేస్తున్న జడ్జి గురుఅరవింద్

వాల్మీకిపురం, అక్టోబరు 24(ఆంధ్ర జ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ర్థులకు మరింత మెరుగైన భోజనం అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వాల్మీకిపురం జూనియర్ సివిల్ కోర్టు జడ్జి, మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ గురు అరవింద్ ఆదేశించారు. గురు వారం మధ్యాహ్నం స్థానిక పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జడ్పీ బాలి కోన్నత పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా విద్యార్థులకు ఇస్తున్న భోజనం, మౌలిక వసతుల కల్పన స్థితిగతుల వివరాలను ఆరా తీశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భోజనంలో మరింత మార్పులు తెచ్చి నాణ్యమైన భోజనం అందించాలని సూచిం చారు. కార్యక్రమా ల్లో ఏజీపీ అశోక్‌కుమార్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆనంద్‌కుమార్, హెచ్ఎంలు సావిత్రి, శ్రీదేవి, ఎస్ఐ2, శ్రీహరి, ఉపాధ్యాయులు, మండల న్యాయసేవాధికారి సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం

నిమ్మనపల్లి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారానే వ్యాధులు ప్రబలకుండా చూడవచ్చని ఎంపీడీవో పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని ముష్టూరు పంచాయతీలోని దిగువపల్లిలో ఆయన పర్యటించి గ్రామంలోని నీటి ట్యాంకును పరిశీలించి అపరిశుభ్రత నీటిని ఎప్పటికప్పుడు తొలగించి నీటిని సరఫరా చేయాలన్నారు. అలాగే ప్రతి పంచాయతిలోనూ పాశుధ్యంపై కార్యదర్శులు చొరవ చూపాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మిధున్‌చక్రవర్తి, కార్యదర్శి లోకేశ్వరి పాల్గొన్నారు.

పశుగణనకు పాడిరైతులు సహకరించాలి

పెద్దతిప్పసముద్రం అక్టోబర్ 24 (ఆంధ్రజ్యోతి) :అఖిల భారత పశుగణన సందర్భంగా మండలంలోని పాడి రైతులు సహకరించాలని మండల పశువైద్యాధికారి రమేష్ నాయక్ పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లో శుక్రవారం నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28వ తేదీ వరకు పశుగణనపై సమగ్రంగా సర్వే నిర్వహించనున్నట్లు డాక్టర్ రమేష్ నాయక్ తెలిపారు. మండలంలోని రైతులు గొర్రెలు, మేకలు, ఆవులు, ఎద్దులు, తదితర జంతువుల వివరాలను అధికారులకు తెలియజేసి సమగ్రంగా నివేదికను సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించేలా చూడాలన్నారు.పశువైద్య సిబ్బంది గ్రామాల్లోకి వచ్చినప్పుడు వారికి సహకరించాలని ఆయన రైతులను కోరారు.

వైరల్ ఫీవర్ల నివారణకు ముందస్తు చర్యలు

మదనపల్లె టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో గ్రా మాల్లో ప్రజలకు వైరల్ జ్వరాలు రాకుండా ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని ఎంపీడీవో మస్తాన్‌వలి సూచించారు. గురు వారం స్థానిక ఎంపీడీవో కార్యా లయంలో 26 గ్రామ పంచాయ తీల కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణతో పాటు ఓవర్ హెడ్ నీటి ట్యాంకులను క్లోరినేషన్ చేయించి, తేదీలను నమోదు చేయాలన్నారు. వైద్య సిబ్బందిని సమన్వయం చేసుకుని గ్రామాల్లో పర్యటించి డెంగ్యూ, మలేరియా, జ్వరాలు రాకుండా చర్యలు చేప ట్టాలన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో మంజూరైన అభివృద్ధి పనులు ప్రారంభించేలా వెండర్లతో చర్చించాలన్నారు. ఈవోఆర్డీ అబ్దుల్, పంచాయతీ కార్యర్శులు పాల్గొన్నారు.

'ఎదుర్లగుట్ట భూమిలోకి అనుమతిలేదు'

బి.కొత్తకోట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండ లంలోని శీలంవారిపల్లె వద్దనున్న ఎదుర్లగుట్ట భూమిలో ఎవరూ ప్రవేశించరాదని రెవెన్యూ అధికారులు బోర్డు ఏర్పాటు చేశారు. సమీపంలో భూమి ఉన్న ఇద్దరు వ్యక్తు లు యంత్రాలతో చదును చేసినట్లు గుర్తించినట్లు ఇన్‌చార్జి తహశీల్దార్ మహమ్మద్‌అన్సారీ తెలిపారు. శీలంవారిపల్లె పంచాయతీ పరిధిలోని సర్వేనెంబరు 329లో ఉన్న ప్రభు త్వ భూమిలో ఎవరూ ప్రవేశించరాదని, అక్రమంగా ప్రవేశిం చిన చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఆమేరకు ఆ స్థలంలో బోర్డును ఏర్పాటు చేశారు.

గ్రామ సభలను సద్వినియోగం చేసుకోండి

గుర్రంకొండ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి):రీసర్వేపై గ్రామాల్లో జరుగుతున్న సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ శ్రీనివాసుల పేర్కొన్నారు. గురువారం మండలంలోని శెట్టివారిపల్లె పంచాయతీ అరిగెలవారిపల్లెలో గ్రామ సభలో అయన మాట్లాడుతూ గత ప్రభుత్వం చేపట్టిన భూముల రీసర్వేలో తప్పులను సరిచేసుకోవడానికి గ్రామ సభలు ఉపయోగపడుతాయన్నారు. రైతులు సమస్యలను తెలియజేసి పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.


సకాలంలో వైద్య సేవలు అందించాలి

తంబళ్లపల్లె అక్టోబర్ 24 (ఆంధ్రజ్యోతి) : గర్భిణులు, బాలింతలకు సకాలంలో వైద్య సేవలు అందించాలని తంబళ్లపల్లె ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి వెంకట్రామయ్య నర్సులకు సూచించారు. గురువారం ప్రభుత్వ ఆసుపత్రిలో తంబళ్లపల్లె, బి.కొత్తకోట ప్రభుత్వ ఆసుపత్రులలో విధులు నిర్వర్తిస్తున్న నర్సులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కేర్ క్యాంపెయిన్ ప్రోగ్రాం ట్రైనర్ డాక్టర్ సంధ్య మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత మహిళలు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవం జరిగే విధంగా అవగాహన కల్పించాలన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని సూచించారు. ఈకార్యక్రమంలో వైద్యులు, నర్సులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం

వాల్మీకిపురం, అక్టోబరు 24(ఆంధ్ర జ్యో తి): పోలియో రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ సహకరిం చాలని వైద్యాధి కారులు జులేఖబేగం, శ్రీవిద్య పేర్కొన్నా రు. వాల్మీకిపురం మండలంలోని చింతప ర్తి గ్రామంలో గురువారం ప్రపంచ పోలి యో దినోత్సవం సందర్భంగా వైద్యా ధికా రులు, విద్యార్థులు ర్యాలీ చేపట్టి ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి సంవత్స రం అక్టోబర్ 24వ తేదీని ప్రపంచ పోలి యో దినోత్సవం నిర్వహించుకోవడం జరు గుతోందన్నారు. మనదేశంలో గత 29 సంవత్సరాలుగా పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతంగా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా పోలియో వైరస్‌ను నిర్మూలించే వరకు పోలియో టీకాలు వేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈకార్యక్రమంలో హెచ్ఎం రెడ్డెప్పరెడ్డి, హెల్త్‌ఎడ్యుకేటర్ మొహ్మద్‌రఫీ, సీహెచ్‌వో ఇందిరారాణి, సూపర్‌వైజర్లు సుధాకర్, భానుబీ, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ హాస్టళ్ల పరిశుభ్రతపై దృష్టి సారించాలి


ఈవో గురుమోహన్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎన్ఎస్‌యూఐ నాయకులు

పీలేరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పీలేరు పట్టణంలోని ప్రభుత్వ వసతి గృహాల పరిశుభ్రతపై దృష్టి సారించాలని పీలేరు పంచాయతీ ఈవో గురుమోహన్‌కు ఎన్ఎస్‌యూఐ నాయకులు విజ్ఞప్తి చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం వారు ఆయనకు ఆ మేరకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మద్దెల అమృత తేజ మాట్లాడుతూ పట్టణంలోని అన్ని ప్రభుత్వ వసతి గృహాలు, పరిసర ప్రాంతాల్లోనూ పిచ్చి మొక్కలు పెరిగిపోయి అపరిశుభ్రంగా మారాయన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు సాయి సంపత్, అఖిల్, భరత్, చరణ్ పాల్గొన్నారు.

ఉచిత బస్సు హామీ నెరవేర్చాలంటూ కాంగ్రెస్ నిరసన

కలికిరి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీల్లో భాగంగా టీడీపీ ఇచ్చిన మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం నెరవేర్చనందుకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ స్థానిక ఆర్టీసీ బస్టాండులో ప్రదర్శన నిర్వహించారు. ఆ పార్టీ పీలేరు ఇన్‌చార్జీ సోమశేఖర్ రెడ్డి మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకపోవడాన్ని తప్పుబట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలైనా హామీలు అమలు చేయలేదని దీనిపై పోస్టు కార్డు ఉద్యమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పీలేరు మండల అధ్యక్షుడు దుబ్బ శ్రీకాంత్, నాయకులు శ్రీవర్ధన్ చౌదరి, హాబీబ్, చాంద్ బాషా, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.